

ఉష్ణోగ్రత (అంచనా)

| 8-6-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 41 | 28 |
| తెనాలి | 40 | 28 |
| నరసరావుపేట | 40 | 28 |
| బాపట్ల | 40 | 28 |
| రెంటచింతల | 41 | 28 |
| చీరాల | 40 | 28 |

# చిన్నోడైనా.. చేసేసుకుంటాం

sunday special

## నచ్చితే చాలంటోన్న అమ్మాయిలు

- పెళ్లిపై మారుతున్న నవతరం స్వరం
- సంప్రదాయాలను కాదంటోన్న యువతరం
- తమ ఆకాంక్షలకు అనుగుణంగా అబ్బాయిల ఎంపిక
- నగరాలు, సెలబ్రిటీల నుంచి గ్రామాల్లోకి చొచ్చుకెళ్లిన వైనం





పెళ్లి అంటే.. రెండు మనసులు.. మూడు ముళ్లు.. ఏడు అడుగులు. మన సంప్రదాయం ప్రకారం వయస్సు.. కులానికి పెద్దలు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. కానీ నేటి తరం ముఖ్యంగా యువతులు మనసుకు నచ్చితే చాలు.. అబ్బాయి చిన్నవాడైనా పర్లేదంటోంది. ఒకప్పుడు కొందరు సెలబ్రిటీల్లో కనిపించిన ఈ తరహా వివాహాలు ఇప్పుడు జనసామాన్యంలోకి వచ్చేశాయి. నగరాలకే పరిమితమైన ఈ ఆలోచనలు ఇప్పుడు గ్రామాలకు విస్తరించాయి. వరుడు కన్నా వధువు వయసు పెద్దగా ఉంటే అదో పెద్ద చర్చ ఒకప్పుడు కానీ ఇప్పుడు ఇది చాలా సాధారణ మైపోయింది. తాజాగా జరిగిన అఖిల్ వివాహం కూడా ఈ కోవలోనిదేనని సమాచారం. కానీ ఈ విషయంపై ప్రజల్లో పెద్దగా చర్చ జరగకపోవడం ఆ తరహా వివాహాల ఆమోదానికి అద్దం పట్టేదిగా ఉంది. మనువు.. మనసుతో ముడిపడిన విషయం దానికి వయసు తారతమ్యం ఎందుకని యువతులు ప్రశ్నిస్తున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రేమకు రెండు మనసులు కలిస్తే చాలు. కానీ పెళ్లికి వయసులు కూడా కలవాల్సిందే. పెద్దలు కుదిర్చిన పెళ్లయితే ఇది తప్పనిసరి. అమ్మాయి కన్నా అబ్బాయి కనీసం ఓ రెండు మూడేళ్లయినా పెద్ద వాడై ఉండాలి. ఇదే సంప్రదా యం. అయితే ఈ తరం అమ్మాయి మారుతోంది. తన ఆలోచనలను మార్చుకుంటోంది. తనకేం కావాలో తెలుసుకుంటుంది. సాధించుకుంటోంది. పెళ్లికి మనసు ముఖ్యం కానీ వయసు కాదంటోంది. ఈ మార్పును అబ్బాయిలతో పాటు పెద్దలూ అంగీకరిస్తున్నారు. మేం తక్కు వేం టి... అబ్బాయి గొప్పేంటి? కలసి నడవాల్సిన మా మధ్య ఉండాల్సింది అవగాహన కదా.. వయసు అంతరమెందుకు? మనసుకు నచ్చినోడు మాకన్నా పెద్దవాడే కావాలంటే ఎలా? చిన్నోడైతే సమస్యేంటి? ఇవీ.. ఈ తరం అమ్మాయిల ఆలోచనలు. అమ్మాయిల్లో ఆర్థిక స్వాతంత్ర్యం పెరగడంతో వివాహం విష యంలో మిగతా వాటికన్నా తమ ఇష్టా నికే పెద్దపీట వేస్తున్నారు. మనది పురుషాధిక్య సమాజం కాబట్టే అబ్బాయి కన్నా అమ్మాయి చిన్నదై ఉండాలనే నిబంధన తెచ్చారనే భావన యువతుల్లో వ్యాపించింది. పెళ్లిపై అమ్మాయి స్వరం మారుతోంది. తమ ఆకాంక్షలకు అను గుణంగా జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుం టున్నది. వయసులో తనకన్నా చిన్నవాడైనా పర్లేదంటోంది. మనసుకు నచ్చితే పెద్దలను (మిగతా 6వ పేజీలో)

### నాడు సంచలనం..

ఆరోప్రాణం.. అప్పుడెప్పుడో తొంభయ్యో దశకంలో వచ్చిన సినిమా అది. అందులో హీరో వినీత్.. హీరోయిన్ సౌందర్య కన్నా రెండేళ్లు చిన్నవాడు. వారి ప్రేమకు అదే అడ్డంకి. దీన్ని అధిగమించి వారు ఎలా ఒక్కటయ్యారన్నదే కథ. అప్పట్లో ఈ సినిమా గురించి ఓ రేంజ్‌లో చర్చలు జరిగాయి. అదే తొంభయ్యో దశకంలోనే సచిన్ టెండూల్కర్.. తనకన్నా ఐదేళ్ల పెద్దమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అప్పట్లో అదో సంచలనం. ఈ విషయం గురించి చర్చించని గడప లేదంటే అతిశయోక్తి కాదు.

### నేడు క్రేజీ..

తనకన్నా రెండు మూడేళ్ల వయసు తక్కువగా ఉన్నవాడిని చేసుకోవడం అమ్మాయిల్లో క్రేజీగా మారుతోంది. పల్లె సీమల్లో వివిధ కారణాలతో ఇలాంటి వివాహాలకు అనుమతి ఇస్తుంటే నగరాల్లో అయితే అమ్మాయిలు ఏరికోరి మరీ తమకన్నా చిన్నవాడినే వరించడం కొసమెరుపు. అబ్బాయిలు కూడా ఈ క్రేజీ అమ్మాయిల వెంటే ఆనందంగా నడుస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువులు, విదేశాలలో స్థిరపడిన అమ్మాయిలలో ఈ ధోరణి ఎక్కువగా కనబడుతోంది. అన్నీ కుదిరి అమ్మాయి వయసు ఎక్కువగా ఉండడమే ప్రతిబంధకంగా మారితే అబ్బాయి తరపు వాళ్లే ముందుకొచ్చి అదేమంత ఇబ్బంది కాదని వధువు కుటుంబీకులను ఒప్పించడం గమనించాల్సిన అంశం.



## భక్తిశ్రద్ధలతో బక్రీదు

ఆంధ్ర ముస్లిం కాలేజీలో జరిగిన బక్రీద్ ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ప్రత్యేక ప్రార్థనలతో ఈద్గాలు కిటకిట

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీదు పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా శనివారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు పెద్దసంఖ్యలో ముస్లింలు సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చారు. గుంటూరు, మంగళగిరి, పొన్నూరు, తెనాలి తదితర ప్రాంతాల్లోని ఈద్గా లకు ముస్లింలు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద మత గురువులు బక్రీద్ విశిష్ఠత గురించి వివరించారు. వేడుకల్లో భాగంగా ఖుర్బానీ చేసి దానధర్మాలు చేశారు. ఆంధ్రముస్లిం కళాశాల ఆవరణలోని ఈద్గాలో తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యేలు ఎండీ ముస్తఫా, మస్తాన్‌వలి, జియావుద్దీన్‌లు హాజరై ప్రార్థనలు చేశారు.

# ఎక్కడి వాళ్లు అక్కడే

- 20 ఏళ్లు దాటినా బదిలీలు లేవు
- లేని రోగాలు చూపెడుతున్న ఎస్టీవోలు
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కోసం నానాపాట్లు
- బదిలీలలో ఖజానా శాఖ నిబంధనలకు నీళ్లు



గుంటూరు సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల సర్వీస్ దాటిన వారిని ఖచ్చితంగా బదిలీ చేయాలని ప్రభుత్వం చెబుతుంది. ఇరవై ఏళ్లు అయినా పర్వాలేదు అంటోంది ఖజానాశాఖ. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల డీటీవోలు ఉద్యోగుల బదిలీ విషయంలో నిబంధనలు పాటించటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం గత నెలలో వెలువరించిన జీవో ప్రకారం ఖజానా శాఖకు చెందిన చాలామంది అధికారులు, సిబ్బందికి స్థానచలనం కలగాలి. కానీ కాసుల వర్షం కురిపించే స్థానాలను వదలకుండా ఉండేందుకు నానాప్రయత్నాలు చేస్తున్నారు. అటువంటి వారికి అధికారులు కూడా వంత పాడుతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఒకే స్థానంలో 20 ఏళ్లు.. 15 ఏళ్లు పైబడి సర్వీస్ చేసిన వాళ్లు కూడా బిందాస్‌గా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా లోని కొందరు ఎస్టీవో(సబ్ ట్రెజరీ ఆఫీసర్)లు బదిలీ నుంచి తప్పించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు, డయాలసీస్ చేయించుకునే వారిని బదిలీ నుంచి మినహాయించాలని జీవోలో ఉంది. ఈ మినహాయింపు పొందేందుకు కొందరు ఎస్టీవోలు లేని రోగాలు ఉన్నట్లుగా చూపుతున్నట్లు సమాచారం. జీవోలో లేని రోగాలు కూడా చేర్చి బదిలీకి సున్నం కొడుతున్నారు. ఓ ఎస్టీవో కేవలం ఒక కిడ్నీ అని చూపారు. అయితే జీవో ప్రకారం అటువంటి మినహాయింపు లేకపోయినా బదిలీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. బదిలీలను తప్పించుకునేందుకు ఐదుగురు ఉద్యోగులు దొంగ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తెలుస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున ఆయా పదవుల్లో ఉన్నట్లు సర్టిఫికెట్లు సమర్పించారు. వాస్తవానికి ఆ లేఖలు 2022లో ఇచ్చినవని నాయకులు చెబుతున్నారు. అప్పటి లేఖలు ఇప్పుడు చూపించి బదిలీ ప్రక్రియను తప్పించుకునేందుకు పక్కదారి పట్టించారు.

### రెండు దశాబ్దాలు పై మాటే..

గుంటూరు, బాపట్ల జిల్లాలో కొందరు సీనియర్ అకౌంట్ టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఒకే చోట 20 ఏళ్లపై బడి పని చేస్తున్నారు. బాపట్లలో ఓ ఉద్యోగి 20 ఏళ్లు, తెనాలిలో మరో ఉద్యోగి 18 ఏళ్లు, మంగళగిరి, గుంటూరు కార్యాలయాల్లో ఇద్దరు ఉద్యోగులు 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. బదిలీల నిబంధనల ప్రకారం వారిని బదిలీ చెయ్యాలి. కానీ ఈ పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీలు ఉండవు. పల్నాడు ప్రాంతానికి చెందిన ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని గుంటూరుకు బదిలీ చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## ప్రమోషన్‌కు.. ఫాల్స్ లేఖ!

8

- బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో లబ్ధి
- ఉద్యోగ సంఘాల నే(మే)తల చేతివాటం
- సంఘంలో లేకున్నా..ఉన్నట్లు సిఫారసు లేఖలు
- ఒక్కో లేఖకు రూ.లక్షల్లో వసూళ్లు

## భారతీరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

సాక్షిలో అనుచిత వ్యాఖ్యలపై మహిళల ఆగ్రహం
- కృష్ణంరాజు, కేఎస్ఆర్‌పై పోలీసులకు మహిళల ఫిర్యాదు




మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న అమరావతి మహిళలు

మంగళగిరి సిటీ, తుళ్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అనుచిత వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి మీడియా, దాని యాజమాని భారతీరెడ్డి మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని అమరావతి మహిళలు డిమాండ్ చేశారు. జర్నలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ అమరావతి రైతులు, మహిళలు శనివారం మంగళగిరిలో అంబేడ్కర్ సెంటరులో నిరసన తెలిపారు. అమరావతి మహిళలను అవమానిస్తూ కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసి శిక్షించాలని మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అమరావతి జేఏసీ మహిళా నేత ఆకుల జయసత్య మాట్లాడుతూ అమరావతి రాజధాని కోసం భూము లిచ్చిన మహిళలను కించపరిచే విధంగా అమరావతి వేశ్యల రాజధాని అంటూ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. తల్లిని, చెల్లిని గౌరవించ లేని జగన్‌రెడ్డి అదే పైత్యాన్ని ప్రదర్శిస్తూ రాష్ట్రంలోని మహిళలందరినీ అవమానించారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ నేతలు యలమంచిలి పద్మజ, తోట పార్థసారథి, యర్రగుంట్ల భాగ్యారావు, తోట సాంబయ్య, రుద్రు కోటేశ్వరరావు, వేమూరి మైనర్ బాబు, ఆవల రవికిరణ్, ఈపూరి పెద్దబ్బాయ్, నీలం అంకారావు, తోట శ్రీనుబాబు, కట్టెపోగు కిశోర్, బత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి మహిళలను కించపరిచిన జర్నలిస్ట్ కృష్ణంరాజు, లైవ్ డిబేట్‌పెట్టి అతడ్ని ప్రోత్సహించిన కొమ్మనేని శ్రీనివాసరావులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో రాజధాని ప్రాంత మహిళలు, రైతులు ఫిర్యాదు చేశారు. ఎస్సీ నియోజకవర్గమైన తాడికొండ పరిధిలోని తమపై జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతినేలా ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిద్దర్నీ అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత మహిళలు మేరుగ సరిత, పెద్దమాను కోటమ్మ, వనమ్మ, దళిత జేఏసీ నేత చిలకా బసవయ్య, రైతు జేఏసీ నేతలు పువ్వాడ సుధాకరరావు, యర్రగోపు నాగరాజు, రామినేని చిన్నా తదితరులు పాల్గొన్నారు.



తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న రాజధాని దళితులు

## ఇంటర్ అడ్వాన్స్‌లో అరకొరే

ప్రథమ 45, ద్వితీయ సంవత్సరం 63 శాతం ఉత్తీర్ణత

గుంటూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు శనివారం విడుదల చేసిన ఫలితాల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యార్థులు అరకొర ఫలితాలు సాధించారు. మూడు జిల్లాల సగటును పరిశీలిస్తే ప్రథమ సంవత్సరం విద్యార్థులు 45 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు జిల్లా నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5117 మంది పరీక్షకు హాజరుకాగా 2425 మంది(48 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాపట్ల జిల్లా నుంచి 2762 మందికి 1150 మంది(42 శాతం), పల్నాడు జిల్లా నుంచి 4846 మందికి 2049 మంది(42 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో గుంటూరు జిల్లా నుంచి 3202 మంది పరీక్ష హాజరుకాగా 2011 మంది(63 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాపట్ల జిల్లా నుంచి 2098 మందికి 1319 మంది(63 శాతం), పల్నాడు జిల్లా నుంచి 2798 మందికి 1884 మంది(67 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

## పవర్ పీల్చేస్తున్నారు!

8

- మండుటెండలతో పెరుగుతోన్న విద్యుత్ వినియోగం
- వారం రోజుల వ్యవధిలోనే గణనీయంగా పెరిగిన డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 21.6 మిలియన్ యూనిట్లకు చేరుతున్న వాడకం





8

## తెరుచుకోనున్న.. మిర్చి యార్డు గేట్లు

నేటి సాయంత్రం నుంచి మిర్చి టిక్కీల దిగుమతికి అనుమతి




8

## శివాజ్ఞతోనే కన్నప్పని నిర్మించాం

గుంటూరు ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మంచు మోహన్‌బాబు, విష్ణు

## వీఆర్వోపై అత్యాచారం కేసు

పొన్నూరుటౌన్ జూన్ 7(ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేస్తున్న మహేష్‌పై అత్యాచారం కేసు నమోదైంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు.. నిడుబ్రోలుకు చెందిన ఓ వివాహిత ఈ నెల 3న అర్బన్ పోలీసులకు వీఆర్వోపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. వీఆర్వో మహేష్ మార్చి 8న తన వద్ద రూ.25 లక్షలు అప్పుగా తీసుకున్నట్లు సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొంది. ఏప్రిల్ 6న గుంటూరు వస్తే నగదు ఇస్తానని నమ్మించి.. హోటల్‌కు తీసుకువెళ్లి అత్యాచారం చేసినట్లు తెలిపింది. అంతే కాకుండా వీడియో తీసి, దానిని బహిర్గతం చేస్తానని బెదిరించి మరో రూ.2 లక్షలు వసూలు చేశాడని పేర్కొంది. వీఆర్వో వల్ల తనకు ప్రాణహాని ఉందని తెలిపింది. అయితే కేసు నమోదు చేసినట్లు తెలుసుకున్న వీఆర్వో నాలుగు రోజులుగా విధులకు హాజరు కాకుండా..పరారీలో ఉన్నట్లు సమాచారం.

## విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి

పొన్నూరుటౌన్, (చేబ్రోలు) జూన్ 7(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం చెన్నారెడ్డి కాలనీకి చెందిన రైతు కూలీ కారుమూరి ధనంబాబు(80) శనివారం ఇంటి వద్ద మోటార్ స్విచ్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.

## పురుగు మందు తాగి ఆత్మహత్య

బాపట్లరూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. బాపట్ల రూరల్ ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల మండలం కొండుబొట్లవారిపాలెం గ్రామానికి చెందిన నామన ఆదినారాయణ (74) కుటుంబ గొడవల నేపథ్యంలో పురుగు మందు తాగి, మృతి చెందాడు. మృతుడి కుమారుడు శేషగిరి ఫిర్యాదు మేరకు.. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.





మాట్లాడుతున్న అనంత నగేష్ బాబు

## కాలుష్యంతో శూన్యంలో జల సంపద

### జాతీయ మత్స్యకార సంఘం సెక్రటరి జనరల్ అనంత నగేష్‌బాబు

బాపట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరంలో నానాటికి కాలుష్యం విపరీతంగా పెరిగి పోవడం వల్ల జల సంపద శూన్యమయ్యే ప్రమాదం ఉందని జాతీయ మత్స్యకార సంఘం ఆలిండియా సెక్రటరి జనరల్ అనంత నగేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం మత్స్యకార సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివిస్ ఫార్మాసూటికల్స్ ఐదు పైపులైన్లు సముద్రం లోపలికి వేయడం వల్ల మత్స్యకారులు రోడ్డు పాలవుతున్నారని చెప్పారు. భూగర్భ జలాలు విషపూరితంగా మారి మత్స్యకారులు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. దివిస్, అరబిందో, హెటిరో, డెక్కన్ మొదలగు ఫార్మా కంపెనీలు సముద్ర తీరం వెంట ఉండి, వ్యర్థాలను పైపుల ద్వారా సముద్రంలోకి వదలడం వల్ల మత్స్యసంపద తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కంపెనీలపైన అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే జాతీయ మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మోసా అప్పలరాజు, గొల్ల ఏకాక్షరి, ఓరుకుల జయశంకర్, మారం రవికుమార్, మైలి జగ్గారావు పాల్గొన్నారు.

## జీజీహెచ్ నుంచి రిమాండ్ ఖైదీ పరార్

### ఇటీవల హత్య కేసులో అరెస్టయిన నిందితుడు నాగుల్‌మీరా

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్ నుంచి రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. నలుగురు ఎస్కార్ట్ పోలీసుల కళ్ళుగప్పి నిందితుడు నాగుల్ మీరా పరారయ్యాడు. ఇటీవల చేబ్రోలు పరిధిలోని సుద్దపల్లిలో జరిగిన గోపీ హత్య కేసులో నాగుల్‌మీరా నిందితుడిగా ఉన్నాడు. తన భార్యతో గోపీ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కారణంతో నాగుల్ మీరా ఈ హత్యకు పాల్పడ్డాడు. ఆ కేసులో నిందితుడైన నాగుల్ మీరాను చేబ్రోలు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో జీజీహెచ్‌కు తరలించారు. అనారోగ్య కారణంతో నాగుల్‌మీరాను వైద్య పరీక్షల కోసం శనివారం ఉదయం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు తీసుకువెళుతుండగా ఎస్కార్ట్ పోలీసుల కళ్ళుగప్పి పరారయ్యాడు. నాగుల్‌మీరాతో పాటు మరో రిమాండ్ ఖైదీని కూడా వైద్య పరీక్షలకు జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. వీరికి హెడ్ కానిస్టేబుల్ ఎం డేవిడ్ రాజుతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్ళను ఎస్కార్ట్‌గా నియమించారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన నలుగురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేసే అవకాశం ఉంది. ఖైదీ పరారీపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నోడైనా.. చేసేసుకుంటాం

(5వ పేజీ తరువాయి)

ఒప్పించి పెళ్లి చేసుకుంటోంది.

**వయసు పట్టింపు లేదు..**

పెళ్లిళ్ల పేరయ్యలు మొదలు, మ్యాట్రిమోని సైట్ల వరకు గతంలో అబ్బాయి వయసు ఎక్కువగా ఉండాలనేది దాదాపు ఓ అధికారిక నిబంధనగా ఉండేది. అమ్మాయి వయసు అబ్బాయి కన్నా తక్కువగా ఉండడం తప్పనిసరి. అలాంటి సంబంధాలే తల్లిదండ్రుల వద్దకు వెళ్లేవి. కానీ గడచిన దశాబ్ద కాలంగా ఈ తీరులో కొంత మార్పు రాగా ఇటీవల కొన్ని మ్యాట్రిమోని సైట్లలో వయసు విషయంలో నాలుగు నుంచి ఐదేళ్ల వరకు తమకు ఇబ్బందేమి లేదని అమ్మాయిలు, అబ్బాయిలూ ఇద్దరూ ఆప్షన్ ఇస్తున్నారు. ఉమ్మడి గుంటూరుతో పాటు బాపట్ల జిల్లాలో కూడా చాలా వరకు గ్రామీణ నేపథ్యమే ఎక్కువ. దశాబ్దం క్రితం వరకు వయసులో అబ్బాయి కన్నా అమ్మాయి వయసు ఎక్కువగా ఉండే పెళ్లిళ్లకు పెద్దలు అంగీకరించేవారు కాదు. గుట్టుచప్పుడు కాకుండా జరిగే ప్రేమ వివాహాల్లోనే వయసు ఎక్కువ విషయాన్ని గోప్యంగా ఉంచేవారు. అయితే ప్రస్తుతం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన వివాహాల్లో అమ్మాయి వయసు అబ్బాయి కన్నా కనీసం రెండేళ్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నమోదయ్యే వివాహాలను పరిశీలించినా నెలకు ఐదు నుంచి పది వరకు అమ్మాయి వయసు అబ్బాయి కన్నా ఒకటి నుంచి మూడేళ్ల వరకు ఎక్కువగా ఉంటుందని అధికారిక గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇవి కూడా ఎక్కువగా గ్రామాల్లో పుట్టి పెరిగిన వారే కావడం గమనార్హం. వరుడు కన్నా వధువు వయసు ఎక్కువగా ఉండే వివాహాలు ప్రేమల్లోనే కాకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లలో కూడా చాలా సహజమై పోయాయి.

**శాస్త్రీయ ఆలోచనలే సంప్రదాయంగా..**

సహజంగా ఆలోచనల్లో పరిపక్వత విషయంలో అబ్బాయి కన్నా అమ్మాయి దాదాపు ఐదేళ్లు ముందుగానే ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. దీంతో వివాహం అనంతరం సమస్యలు తలెత్తకుండా ముందుచూపుతో వయసు అంతరం పెట్టి శాస్త్రీయ నిరూపణనే సంప్రదాయంగా స్థిరపరచారని అభ్యుదయవాదులు చెబుతుండగా, వరుడు వధువు కంటే పెద్దవాడై ఉండాలని లేకపోతే పురుషుడికి ఆయుక్షీణమని ధర్మశాస్త్రాలలో ఎప్పుడో చెప్పారని పండితులు వాదిస్తున్నారు.

## సుమోటోగా అరెస్టు చేయాలి

### ● మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూములిచ్చిన మహిళలపై సాక్షి టీవీలో విశ్లేషకుడిగా చెప్పుకునే కృష్ణంరాజు ఘోరమైన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి డిమాండ్ చేశారు. వెంటనే ఆయన బేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలని కోరారు. ఇది మహిళా లోకానికే అవమానమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక మంత్రి రాజధానిని శ్మశానం అన్నారని గుర్తుచేశారు. తక్షణమే అతన్ని అరెస్టు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటివి ప్రోత్సహిస్తోన్న సాక్షిని వెంటనే బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు.

## అమరావతిపై విష ప్రచారం చేస్తే మహిళలే బుద్ధి చెబుతారు

### - ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల రాజధాని అమరావతిని వేశ్య రాజధాని అని.. జగన్ మీడియాలో ఓ పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడించడం సిగ్గు చేటని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక మహిళ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆ పత్రిక అవినీతితో పుట్టిందని, మొన్న జరిగిన ఎన్నికల్లో మహిళల చేతిలో చావుదెబ్బ తిన్నా ఇంకా ఆ పార్టీ నేతలకు, ఆ పత్రికకు బుద్ధి రాలేదన్నారు. సంస్కారం లేని రాతలు ఇకనైనా మానుకోకుంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని యరపతినేని పేర్కొన్నారు.

## జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

### - ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జగన్ తక్షణమే సాక్షి టీవీ ఘటనపై రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజధాని మహిళలను కించపరిచిన సాక్షి చానల్‌కు, ఆ టీవీ సిబ్బందికి, దాని సృష్టికర్త జగన్‌కు రాష్ట్ర మహిళలు తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. మరోమారు ఏ మహిళ గురించి అయినా చులకనగా మాట్లాడాలంటే భయపడేలా శాస్తి చేయాలని కోరారు. సాక్షి ఛానల్, పత్రిక పుట్టుక నుంచి తగిన విచారణ జరిపి, పత్రికా స్వేచ్ఛ ముసుగులో అడ్డగోలుగా చేస్తున్న దుష్ప్రచారంపై లోతుగా విశ్లేషించాల్సిన బాధ్యత ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు.

## గూడ్స్ రైలు ఢీకొని యువకుడి మృతి

నరసరావుపేట లీగల్, జూన్ 7, (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొని పట్టణానికి చెందిన ఈళ్లూరి వీరాంజనేయరెడ్డి (38) అనే యువకుడు మృతి చెందిన ఘటన శనివారం మధ్యాహ్నం శంకరమఠం వద్ద చోటుచేసుకుంది. నరసరావుపేట రైల్వే ఇన్‌చార్జి ఎస్సై గితిక వివరాల మేరకు.. వీరాంజనేయరెడ్డి శంకర మఠం సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా.. గుంటూరు నుండి నరసరావుపేట వైపు వచ్చే గూడ్స్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ఆధార్ కార్డు ఆధారంగా సదరు విషయాన్ని మృతుడి తల్లిదండ్రులకు తెలిపారు. మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలోని శవాగారానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## ఐదు ఎకరాల గడ్డివామి దగ్ధం

### - రూ.2లక్షల ఆస్తినష్టం

బాపట్లరూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భర్తీపూడిలో ఐదు ఎకరాల గడ్డివామి శనివారం అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతు దేవరకొండ శ్రీనివాసరావు గడ్డివామికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రైతుకు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఏపీలో కొత్తగా ప్రారంభించబోతున్న పది మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు- ప్రైవేటీకరణ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజారోగ్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య మాట్లాడుతూ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని కోరారు. తోటి తెలంగాణ రాష్ట్రం నడుపుతున్నప్పుడు... ఏపీ ప్రభుత్వం ఆ సేవలను అందించలేమని చెప్పడం బాధ్యతా రాహిత్యమని పేర్కొన్నారు. రాష్ట్ర మెడికల్ విద్యార్థులు, తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటనను స్వాగతిస్తున్నామని... అదే సమయంలో పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ జీఓ నంబర్లు 107, 108 రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వాటిని కొనసాగించడం దారుణమని అన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకుడు వేణుగోపాలరావు మాట్లాడుతూ నూతన విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు జిల్లా కేంద్రాల్లో ఉండే ప్రభుత్వ, ప్రాంతీయ ఆస్పత్రులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ దశలవారిగా ప్రైవేటు సంస్థలకి కట్టబెడతారని పేర్కొన్నారు. ప్రజారోగ్య వేదిక నగర కార్యదర్శి జి.శ్రీనివాసరావు ఈ విధానం అమలైతే వైద్య కళాశాలల్లో ఫీజులు పెరుగుతాయని, పేద విద్యార్థులు డాక్టర్లయ్యే అవకాశం తగ్గుతుందని అన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు, మాట్లాడుతున్న అలా వెంకటేశ్వర్లు

## నిర్మాణ భవనం పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లి (వడ్డేశ్వరం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ కథనం మేరకు.. డీజీపీ కార్యాలయ సమీపంలో ఓ హోటల్ పక్కన నిర్మాణం జరుగుతున్న భవనం 5వ అంతస్తు నుండి వ్యక్తి దూకి మృతి చెందాడన్న సమాచారంతో సీఐ కల్యాణ రాజు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు గుంటూరు విద్యానగర్‌కు చెందిన గండు జగదీష్ (35)గా గుర్తించారు. మృతుడి సోదరుడు సునిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

## పుష్కర ఘాట్ వద్ద ఉరేసుకుని వ్యక్తి ...

తాడేపల్లి టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం పుష్కర ఘాట్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక శివాలయం వీధి ఎదురుగా ఉన్న ఘాట్‌లో ఉన్న చెట్టుకు ఓ వ్యక్తి వేలాడుతూ. ఉన్నాడని స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ జె.శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. లుంగి, కండువాలను ముడివేసి చెట్టుకు ఉరేసుకున్నట్టు గుర్తించామని, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు. మృతుడికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉండొచ్చని, ఒంటిపై నలుపు రంగు ఫ్యాంట్, పింక్ కలర్ చొక్కా ఉన్నాయని, ఎవరికైనా సమాచారం తెలిస్తే తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

## రాజకీయ విద్రోహశక్తి పిన్నెల్లి

### - మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయ విద్రోహ శక్తి మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శనివారం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో ఇటీవల ప్రత్యర్థుల చేతిలో హతులైన టీడీపీ సీనియర్ నాయకులు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు కోటేశ్వరరావు దశదిన కర్మ సంతాప సభలో ఎమ్మెల్యే జూలకంటి పాల్గొన్నారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జంట హత్యల కేసులో ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. పచ్చని పల్లెల్లో పిన్నెల్లి సోదరులు కాలుష్యాన్ని సృష్టించి విష బీజాలను నాటుతున్నారని జూలకంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు, దౌర్జన్యాలతో నియోజకవర్గాన్ని భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. కుహానా ఫ్యాక్షన్ శక్తులు వెన్నులో వణుకు పుట్టించేలా కూటమి ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సంఘ విద్రోహ శక్తులను చట్టం ప్రకారం శిక్షిస్తామన్నారు. జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కోవర్టు రాజకీయాలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటారని పిన్నెల్లి సోదరులను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరించారు. అభివృద్ధిలో వెనుకబడిన మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచేందుకు పనిచేస్తుంటే పిన్నెల్లి సోదరులు రాజకీయపబ్బం కోసం నీచ రాజకీయాలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. నాయకులు పాల్గొన్నారు.



జెవిశెట్టి సోదరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

## సాగర్ సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 511.60 అడుగులు ఉంది. ఇది 134.40 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 21.35 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 121, 129, 140 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 228.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 238.00 |



డీఈవో సీవీ రేణుకకు వినతి పత్రం అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

## మ్యాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ఐక్యవేదిక నాయకుల ఆందోళన
- నేడు డీఈవో కార్యాలయ ముట్టడికి పిలుపు

గుంటూరు(విద్య),జూన్ 7(ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీటీలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించడం దారుణమని, ఇందుకు నిరసనగా ఆదివారం కార్యాలయ ముట్టడి నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రకటించారు. శనివారం ఎస్‌జీటీలకు ఫోన్ చేసి బలవంతంగా వెబ్ అప్షన్స్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడం తగదని సూచించారు. ఇందుకు నిరసనగా గుంటూరు ఎంఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. స్టీరింగ్ కమిటీ నాయకులు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు రాష్ట్ర ఐక్య వేదికకు ఇచ్చిన హామీ మేరకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెబ్ కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. స్టీరింగ్ కమిటీ నాయకులు ఎం.కళాధర్, పెదబాబు, శ్రీనివాస్, సంపత్, శ్రీనివాసరావు, సుధీర్‌బాబు, హనుమంతరావు, సుబ్బరెడ్డి, రమేష్, ఆదినారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి పోటీలలో సీతారామయ్య హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, జూన్ 7( ఆంధ్రజ్యోతి): రేపల్లెలో ఈనెల 1న నిర్వహించిన 23వ జిల్లా స్థాయి తైక్వాండో, టేకిక్స్ కెరోగి పోటీలలో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య (సీటీఎస్‌ఈ) పాఠశాలకి చెందిన విద్యార్థులు క్యాడెట్ బాలికల విభాగంలో బి.సుధారాణి, క్యాడెట్ బాలుర విభాగంలో కె.ఓంకారేశ్వరరెడ్డి, పి.కౌశిక్ కృష్ణ, జూనియర్ బాలుర విభాగంలో కేవీఎస్ మణికంఠ, సబ్-జూనియర్ బాలుర విభాగంలో వి.జస్వంత్ పాల్గొని 4 పసిడి పతకాలు, ఒక కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల సెక్రటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ శనివారం తెలిపారు. సందర్భంగా విద్యార్థులకు జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10, 11వ తేదీలలో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ వారు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించినందుకు వారిని అభినందిస్తూ చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యలో ప్రావీణ్యం సంపాదించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ డి.దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సెక్రెటరీ పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు

## ఘనంగా రాయపాటి జన్మదిన వేడుకలు

- పలువురు అభిమానుల శుభాకాంక్షలు

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు జన్మదిన వేడుకలు ఆయన కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగాయి. అభిమానులు, నాయకుల సమక్షంలో మాజీ ఎంపీ రాయపాటి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రాజపుత్ర సత్యంసింగ్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని షిర్డీసాయి దీన జన సేవా సమితిలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయాల్లో మకుటం లేని మహారాజుగా ఎదిగి ఆరుసార్లు పార్లమెంట్ సభ్యునిగా పని చేసిన రాయపాటి సాంబశివరావు సేవలను జిల్లా ప్రజానీకం మరువలేనిదని పలువురు నేతలు కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డాక్టర్ రాజా సిద్ధార్థ, రాం భాస్కర్, రాము, సూర్యదేవర రవి, దాసరి జాన్‌బాబు, న్యాయవాదులు పార్థసారథి, మొయినుద్దీన్, షేక్ జిలాని, రావి రవి చౌదరి, ముక్కంటి, షేక్ మీరావలి, గాంధీ చౌదరి, దోవ లక్ష్మయ్య, మట్టు ప్రవీణ్, లక్ష్మణ సాయి, అడపా బాబు, మండల శ్రీనివాస్ తదితరులు పుష్పగుచ్ఛాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.


అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ రాయపాటి

## బ్రాహ్మణ సంక్షేమమే సేవా సంఘ సమాఖ్య లక్ష్యం

- రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణజాతి సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ తెలిపారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో సమాఖ్య 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన నూతన పతాకాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయ కమిటీల చైర్మన్ పదవులలో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని కోరారు. ముందుగా గుంటూరు అన్నదాన సమాజం చైర్మన్ పదవి బ్రాహ్మణులకు కేటాయించాలని కోరారు. సినిమాలలో బ్రాహ్మణ జాతిని చులకన చేసి చూపిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమాఖ్య నూతన వెబ్‌సైట్‌ను సమాఖ్య కోశాధికారి పులిపాక ప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కేవీఎల్ రామచంద్రమూర్తి, వెలవర్తిపాటి పాండురంగ విఠల్, శంకరమంచి లలిత శాస్త్రి, మాచిరాజు మురళీకృష్ణ, కుందేటి సుబ్రహ్మణ్యం, నేపాక పద్మావతి తదితరులున్నారు.

## వైభవంగా స్వామి వారి కల్యాణం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కృష్ణనగర్, శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సుప్రభాత సేవ, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నేత్ర పర్వంగా గోదా పద్మావతి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. విశ్వక్ సేన పూజ, కంకణధారణ, సుముహూర్తం, మంగళ సూత్ర ధారణతో విశేషాలను భక్తులకు వివరిస్తూ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహా హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కనకధారా స్తోత్ర పారాయణం లక్ష మల్లెల, తులసి దళార్చన కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ధనకుదరం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

- ఈద్గాల వద్ద సంప్రదాయ దుస్తులతో ముస్లింల సందడి


ఆంధ్రా ముస్లిం కళాశాల ఆవరణలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు శనివారం నగరంలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలంతా ఉదయాన్నే సంప్రదాయ దుస్తులు ధరించి ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. అంజుమన్ ఈ ఇస్లామియా సంస్థ ఆధ్వర్యంలో నగరంపాలెంలోని ఈద్గా, పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలోనున్న ఈద్గాల వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున చేరుకొని ప్రార్థనలు చేశారు. ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలోని ఈద్గాలో తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యేలు ఎండీ ముస్తఫా, షేక్ మస్తాన్‌వలి, ఎస్ఎమ్ జియావుద్దీన్‌లు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బోధనలు వినిపించి సమాజంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అంతేగాక నగరంలోని లాలాపేట, పట్టాభిపురం, గుజ్జనగుండ్ల, ఎత్తురోడ్డు సెంటర్, శ్రీనివాసరావుపేట, నల్లచెరువు, పొన్నూరు రోడ్డు, మాయబజార్ ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లింలంతా బక్రీద్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇక ఈద్గాలు, మసీదుల ఎదుట ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మరోవైపు హిందూ, ముస్లింలు కూడా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ శుభాకాంక్షలు తెలుపుకోవటం మతసామరస్యాన్ని వెల్లివిరిసేలా చేసింది.

### ఐపీడీ కాలనీ ఈద్గాలో...

గుంటూరు తూర్పు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీక పవిత్ర బక్రీద్ అని ఐపీడీ కాలనీ ఈద్గా అధ్యక్షుడు మీర్ అబ్బాస్ అలీ అన్నారు. శనివారం బక్రీద్ పర్వదిన సందర్భంగా ఈద్గాలో పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా మీర్ అబ్బాస్ అలీ మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి ఈద్గాని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని, ఇంకా అందరి సహకారంతో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఆధ్వర్యంలో షామియానాలు, కార్పెట్‌లు, కూలర్‌లు, వాటర్ డ్రమ్ములు, మినరల్ వాటర్ ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా ఈద్గా కమిటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ నాయకులు షేక్ మునీర్, షేక్ మీరావళి, హడ్డు, అమీర్ బాషా, షేక్ జిక్రియా జానీ, మస్తాన్, ముజీబ్ పాల్గొన్నారు



నగరంపాలెం ఈద్గాలో బోధనలు వినిపిస్తున్న మత పెద్ద, పాల్గొన్న ముస్లింలు

## ఆరోగ్య కేంద్రానికి స్టీల్ ర్యాక్‌లు అందజేత

గుంటూరు మెడికల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నాజ్ సెంటర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భారతీయ జనతా పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, ఆరో మండల బీజేపీ నాయకులతో కలసి శనివారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ ఆరోగ్య కేంద్రానికి మందులు భద్రపర్చేందుకు అవసరమైన స్టీల్ ర్యాక్‌లను వేమూరి అనిల్‌కుమార్, మైలవరపు ప్రవీణ్ అందజేశారు. వీరిని డాక్టర్ ఉమాశంకర్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు సాధించే దిశగా, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చెప్పిన విధంగా అంత్యోదయ సిద్ధాంతం ప్రకారం చిట్ట చివరి వ్యక్తి వరకు ఫలాలు అందించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఆరవ మండల అధ్యక్షులు మలిశెట్టి పవన్‌కుమార్, సీనియర్ నాయకులు సురేష్‌కుమార్ జైన్, వేమూరి అనిల్‌కుమార్, మైలవరపు ప్రవీణ్ పాల్గొన్నారు.


స్టీల్ ర్యాక్‌లతో ఉమాశంకర్, ప్రవీణ్, అనిల్ కుమార్

## షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన నవీనా విద్యార్థిని


అనన్య అభినందిస్తున్న చిన్నపరెడ్డి

గుంటూరు(విద్య), జూన్ 7 ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్లలోని నవీనా స్కూల్ విద్యార్థిని కాకుమాను అనన్య పదవ తరగతిలో 595 మా ర్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్ అవార్డుకు (ఎస్సీ బాలికల కేటగిరీలో) ఎంపి కైనట్లు విద్యాసంస్థల చైర్మన్ ఏరువా చిన్నపరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఏరువ నవీన్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యాపరంగా మరింతగా రాణించి ఉజ్వ ల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని సూచించారు. శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 9న జిల్లా విద్యాశాఖ ఆధ్వ ర్యంలో జరిగే షైనింగ్ స్టార్స్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో అనన్య కు రూ.20 వేల నగదుతో పాటు మెమోంట్, ప్రశంసాపత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు అందించి సత్కారం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలి

గుంటూరు(తూర్పు), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తీవ్ర భారంగా మారే విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటును అడ్డుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ప్రచారంలో భాగంగా ముద్రించిన కరపత్రాలు, స్టిక్కర్లు, పోస్టర్లను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్‌తో ప్రజలపై మరింత భారం పడుతుందని చెప్పారు. వేసవిలో కరెంటుకు ఎక్కువ చార్జీ వసూలు చేయటం ఈ స్మార్ట్ మీటర్ ప్రత్యేకత అని విమర్శించారు. నాటి ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్నును వ్యతిరేఖించిన చంద్రబాబు అదే విధానాన్ని అమలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలపై తీవ్ర భారం మోపుతున్న కార్యక్రమంలో షహీద్, బి ముత్యాలరావు, కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

- అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నాన్ పొలిటికల్ జేఏసీ ఫిర్యాదు

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రాజధాని మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అమరావతి పరిరక్షణ సమితి నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అమరావతి రాజధాని ప్రాంత మహిళలను అవమానపరిచే విధంగా సాక్షి టీవీలో జర్నలిస్ట్‌గా చెప్పుకొనే కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అమరావతి పరిరక్షణ సమితి నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిర్యాదు చేసింది. రాజధాని మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వేశ్య శిబిరాలు అమరావతి చుట్టూ ఎక్కువగా ఉన్నాయని కృష్ణంరాజు అనడంపై అమరావతి జేఏసీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అమరావతి దేవతల రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబు అనడం హాస్యాస్పదంగా ఉందని కృష్ణంరాజు అనడం దారుణమన్నారు.

## 11 సంవత్సరాలు సుపరిపాలన : ఉప్పలపాటి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస రాజు

గుంటూరు సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గడచిన 11 ఏళ్ల పాటు దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలన అందించారని బీజేపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస రాజు అన్నారు. మోదీ పాలనకు 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గుంటూరు బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పా టు చేసిన ప్రతేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి సభాధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు చెరు కూరి తిరుపతిరావు మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా బాధ్యత లు తీసుకున్న దగ్గర నుంచి ఒక ప్రధాన సేవకుడిగా ప్రజలకు పని చేస్తూ మంచి పాలన అందిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపాటి స్వరూపరాణి, ఈదర శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పబ్లిసిటీ డిపార్టుమెంట్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్, చరక కుమార్ గౌడ్, మంత్రి సుగుణ, దేసు సత్యనారాయణ, గోవాడ వెంకట కృష్ణారావు, చుండూరు ఉమా మహేశ్వరరావు, మార్తా నరేంద్ర, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం ఆకాశవాణి, దూరదర్శన్ కళాకారులు భాగీనారాయణశాస్త్రిచే జరిగిన సంగీత విభావరి ఆకట్టుకుంది. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీరికి వయోలిన్‌పై పి.యస్.ఆర్. ఆంజనేయశాస్త్రి, కీబోర్డుపై బీఎస్ సత్యదేవ్, తబలపై పి.శివరామకృష్ణ చక్కటి వాయిద్య సహకారం అందించారు.


కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో సంచరిస్తున్న కుక్కలు

# కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో కుక్కల హల్‌చల్

- బెంబేలెత్తిపోతున్న వాకర్స్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో కొన్ని రోజులుగా పదుల సంఖ్యలో కుక్కలు వాకర్స్‌ను బెంబేలెత్తిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ఈ ట్రాక్‌కు ప్రతి రోజు వందల సంఖ్యలో పాదచారులు ఉదయం, సాయంత్రం వచ్చి వాకింగ్ చేస్తుంటారు. అయితే కుక్కలు గుంపులుగా చేరి వాకర్స్‌పైకి వస్తున్నాయి. వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఈ కుక్కలను చూసి భయపడుతున్నారు. ట్రాక్‌లో ఇటీవల పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అధికారులు ప్రజాప్రతినిధులు కూడా ట్రాక్‌ను సందర్శిస్తున్నారు. అయినా ఈ కుక్కల నిర్మూలనపై ఎవరూ దృష్టి సారించడం లేదని పాదచారులు విమర్శిస్తున్నారు. నగరంలో ఇటీవల పలు ప్రాంతాల్లో కుక్కల కారణంగా చిన్నారుల మృతి, వృద్ధులకు గాయాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇటువంటి పరిస్థితులలో వాకింగ్ ట్రాక్‌లోని కుక్కలను వెంటనే తరలించాలని పాదచారులు అభ్యర్థిస్తున్నారు.

## మహిళలను కించపరుస్తున్న వైసీపీకి మూల్యం తప్పదు

- జగన్‌రెడ్డి, భారతీరెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి
- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను తీవ్రంగా కించపరిచేలా మాట్లాడుతున్న వైసీపీ నేతలు, ఆ పార్టీ చానల్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల ఆత్మాభిమానం మీద, అమరావతి మీద విద్వేషంతో చేస్తున్న అసత్య ప్రచారం వారి దిగజారుడుతనానికి పరాకాష్ట అని, మహిళల జోలికి వచ్చినా, ఆడపిల్లలను అల్లరి చేసినా, అఘాయిత్యాలకు పాల్పడినా వారికి అదే చివరి రోజు అని సీఎం చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తున్నా వైసీపీ నేతలు నోరు పారేసుకుంటున్నారని, మహిళలను కించపరిచేలా ఎవరు మాట్లాడినా కూటమి ప్రభుత్వం ఊరుకోదని హెచ్చరించారు. జగన్, భారతి వెంటనే మహిళలకు క్షమాపణలు చెప్పాలని, దూషించిన కృష్ణంరాజును మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

## అమరావతిపై ఇదేమి కుసంస్కారం జగన్

- మన్నవ మోహన కృష్ణ



ఐదుకోట్ల ఆంధ్రుల రాజధానిని వేశ్యలతో పోల్చడం దుర్మార్గమని, అదే రాజధానిలో నివసిస్తున్న జగన్ ఇంటి మహిళలు కూడా ఇదే కోవలోకి వస్తారనే కనీస ఇంగిత జ్ఞానం లేకుండా చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఇంతవరకు ఖండించకపోవడం నీచమైన చర్య అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మండిపడ్డారు. ఆ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రాజధాని అమరావతిపై హేయభావంతో జగన్ రగిలిపోతున్నాడని, ఐదేళ్లపాటు రైతుల త్యాగాలను హేళన చేయడమే కాకుండా మహిళా రైతుల పట్ల కర్కశంగా వ్యవహరించారని ఆయన విమర్శించారు. జగన్ తన పేటీఎం బ్యాచ్‌తో ఉచ్ఛనీచాలు మరిచి బురదచల్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. జర్నలిస్ట్ కృష్ణంరాజు, చర్చ పెట్టిన కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రసారం చేసిన ఆ సంస్థ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## అమరావతిపై వ్యాఖ్యలు సిగ్గుమాలిన చర్య

గుంటూరు సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జగన్‌కు చెందిన ఛానల్ లో అమరావతి వేశ్యల రాజధాని అంటూ తప్పుడు వ్యాఖ్యలు చేయటం సిగ్గుమాలిన చర్య అని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. గుంటూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిపై తప్పుడు వ్యాఖ్యలు చేసి ఐదు కోట్ల మంది ప్రజల మనోభావాలను జగన్ ఛానల్ దెబ్బ తీసిందని అన్నారు. ఆ వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సదరు ఛానల్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు.

## మహిళలను కించపరిచే వ్యాఖ్యలు హేయం

గుంటూరు(తూర్పు), జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిని, మహిళలను కించపరిచే విధంగా సాక్షి టీవీ చర్చల్లో ప్రముఖ ఎనలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. చరిత్రలో అమరావతికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, బౌద్ధ క్షేత్రం గాను, ఒకప్పటి రాజ్య రాజధానిగాను అమరావతి ఉందని గుర్తుచేశారు. బహుశా ఆ కారణంగానే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజధాని పేరును అమరావతిగా నిర్ణయించడాన్ని రాష్ట్రంలోనూ దేశంలోనూ అనేకమంది హర్షించారన్నారు. తదనంతరం జరిగిన పరిణామాలకు వ్యతిరేకంగా అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని కోరుతూ జరిగిన ఉద్యమంలో మహిళలు ప్రధానమైన భూమిక పోషించారు. ఇలాంటి నేపథ్యంలో ఒక టీవీ చర్చలో అమరావతిని వేశ్యల రాజధానిగా పేర్కొంటూ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నట్టు పేర్కోన్నారు. ఇది రాజధాని ప్రాంత ప్రజలను లేక మహిళలను అవమానించడం మాత్రమే కాక మొత్తం రాష్ట్ర ప్రజలను అవమానించడంగా భావించాల్సి వస్తుందన్నారు.

## రాజధాని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగదు

- భారతీయత అధ్యక్షుడు రవీంద్రబాబు

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిని వేశ్యల రాజధాని అంటూ సాక్షి టీవీలో విశ్లేషకుడు కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేయటం అత్యంత హేయమని భారతీయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిగురుపాటి రవీంద్రబాబు ఒక ప్రకటనలో ఖండించారు. ఆంధ్రులకు అత్యంత ప్రేమాభిమానాల ప్రాంతమైన అమరావతి రాజధానిపై అక్కసు వెళ్ళగక్కటం సిగ్గుమాలిన చర్య అన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై నష్టపరిహారపు చట్టం కింద సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ప్రమోషన్‌కు.. ఫాల్స్ లేఖ!

**● బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో లబ్ధి ● ఉద్యోగ సంఘాల నే(మే)తల చేతివాటం ● సంఘంలో లేకున్నా..ఉన్నట్లు సిఫార్సు లేఖలు ● ఒక్కో లేఖకు రూ.లక్షల్లో వసూళ్లు ● అర్హులైన ఉద్యోగులకు అన్యాయం**

గుంటూరు నగరంలో ఓ సంఘం నేత బదిలీలు, ఉద్యోగోన్నతుల సమయంలో సిఫార్సు లేఖలు ఇవ్వడమే వ్యాపారంగా మలుచుకున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ప్రతి శాఖలో ఉద్యోగులకు తన సంఘంలో ఆఫీస్ బేరర్లుగా పనిచేస్తున్నట్లు సిఫార్సు లేఖలు ఇచ్చి.. తమకు అనుకూలంగా బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందుతారని సమాచారం. సిఫార్సు లేఖల డబ్బుల విషయంలో గతంలో రెండు సంఘాలకు నడుమ కొంతకాలం అంతర్గత యుద్ధం నడిచింది.

సాంఘిక సంక్షేమ శాఖలో ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఓ ఉద్యోగ సంఘం నేత ఇచ్చిన సిఫార్సు లేఖను అడ్డుపెట్టుకొని 9 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారు.

ప్రస్తుతం బదిలీలు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్నాయి. కొంతమంది ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విభజిత జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేస్తూ తమకు కూడా పాయింట్లు కేటాయించాలని ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే దీనిపై కొన్ని ప్రధాన సంఘాలు అభ్యంతరాలు లేవనెత్తడంతో రాష్ట్రస్థాయిలో ఈ ప్రక్రియకు అడ్డుకట్ట పడింది.

గుంటూరు (విద్య) జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వారెప్పుడూ ఏ ఉద్యమాల్లో పాల్గొనరు.. ఉద్యోగుల సమస్యలపై ఏనాడు కనీసం వినతిపత్రం కూడా ఇవ్వరు.. అయినా వారికి బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో భారీ లబ్ధి చేకూరుతోంది. ఉద్యోగ సంఘాల నేత, ఆఫీస్ బేరర్లు అనే ఒక్క సాకుతో ఉద్యోగోన్నతుల బదిలీల్లో పాయింట్లు కొట్టేస్తున్నారు. అర్హులైన ఉద్యోగులకు అన్యాయం చేసి.. ఇటువంటి వారి వద్ద భారీగా ముడుపులు తీసుకుని కొన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సిఫార్సు లేఖలు ఇస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా అర్హులైన ఉద్యోగులు బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో భారీగా నష్టపోతున్నారు. ప్రస్తుతం అన్ని శాఖల్లో బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సమయంలో కొన్ని పాయింట్లు ద్వారా కొంతమంది భారీ లబ్ధి పొందుతున్నారు.

### ప్రభుత్వ నిబంధనతో లబ్ధి..

వాస్తవంగా గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల్లో నాయకులకు, ఆఫీస్ బేరర్లకు మాత్రమే ప్రభుత్వ నిబంధన ప్రకారం కొన్ని పాయింట్లు కేటాయిస్తారు. దీని ప్రకారం ఆయా సంఘాల నాయకులు బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో లబ్ధి పొందుతారు. అయితే కొన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు తమ సంఘంలో లేని వారికి సైతం లేఖలు ఇస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### అప్పుడే విష ప్రచారం

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నెలలో నాలుగు



సార్లు రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. సమస్యలు సావధానంగా విని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్ని సంఘాల నాయకులు మాత్రం ఇప్పటికే కొత్త ప్రభుత్వంపై విష ప్రచారం మొదలు పెట్టారు. గత ప్రభుత్వంలో జీతాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసిన విషయాన్ని విస్మరించి ఈ నేతలు.. వైసీపీ నాయకుల ప్రోత్సాహంతో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందంటూ, డీఏలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు రావడం లేదంటూ ప్రచారం చేస్తున్నారు.

కొన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కేవలం అధికారుల ప్రాపకం కోసం సంఘాలు నిర్వహిస్తూ సభ్యత్వం పేరుతో వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

నగరంలో ఓ ఉపాధ్యాయ సంఘం నేత కొత్తగా ఏర్పాటు అయిన ఉపాధ్యాయ సంఘంలో చేరి దాదాపు రూ.లక్షల్లో సభ్యత్వ రుసుం వసూలు చేశారు. సభ్యత్వ రుసుం లెక్కలు అడిగితే వెంటనే వేరే సంఘంలో చేరిపోయారు. లెక్కలు అడిగిన సదరు సంఘం నేతలపై ఆయన బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం.

ఓ ఉపాధ్యాయ సంఘం నేతలు ఉద్యమాలను వదిలేసి ఉపాధ్యాయులపై వచ్చే ఆరోపణలు, క్రమశిక్షణ చర్యల్ని తమకు అనుకూలంగా మలుచుకుని అవి అధికారుల వద్ద పరిష్కరించినట్లు చూపి.. భారీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మరో ఉద్యోగ సంఘం నేతపై హత్యాయత్నం కేసు ఉంది. అయినా కూడా ఆయనను ఓ ఉద్యోగ సంఘం నాయకులు ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సంఘం ఇచ్చే లేఖలు పొంది కూడా కొంతమంది బదిలీల పాయింట్లు పొందారు. ఇలా ఉద్యోగుల సంక్షేమం సమస్యల కోసం పనిచేయాల్సిన సంఘాలు పక్కదారి పట్టి స్వలాభమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నాయి.

**తెరుచుకోనున్న.. నేటి సాయంత్రం నుంచి మిర్చి టిక్కీల దిగుమతికి అనుమతి**

# మిర్చి యార్డు గేట్లు

**సోమవారం ఉదయం నుంచి ప్రారంభం కానున్న లావాదేవీలు**




హైవేపై మిర్చి లోడింగ్‌కు సిద్ధంగా పెట్టిన కంటైనర్లు

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చి యార్డు) గేట్లు ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి తెరుచుకోనున్నాయి. వివిధ జిల్లాల నుంచి మిర్చి టిక్కీలను అమ్మకానికి తీసుకొచ్చే రైతులను మాత్రమే అనుమతించాల్సిందిగా గేట్ల సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. యార్డు ప్రాంగణం అంతటా శుభ్రం చేయించి లావాదేవీలకు సిద్ధం చేసి పెట్టారు. ఎక్కడా ట్రాఫిక్ ఏర్పడకుండా.. లారీలు, ట్రాక్టర్లు, ఆటోలలో రైతులు తీసుకొచ్చే మిర్చి టిక్కీలను సంబంధిత కమీషన్ దుకాణాల్లో దిగుమతి చేయించి.. వాహనాలను బయటకు పంపించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 7 గంటలకు బెల్ కొట్టగానే కమీషన్ వ్యాపారులు వేలం ప్రారంభించాలని స్పష్టం చేశారు.

### యార్డు తెరవగానే కొనుగోళ్లు..

గత నెల 9న ఎండల తీవ్రత దృష్ట్యా మిర్చి యార్డులో పని చేసే వాతావరణం లేకపోవడంతో హమాలీలు, వ్యాపారుల విజ్ఞప్తి మేరకు యార్డుకు వేసవి సెలవులు ప్రకటించారు. అనంతరం యార్డులో నిల్వఉన్న మిర్చి టిక్కీలన్నింటిని బయటకు తరలించి, గేట్లు మూసేశారు. దీంతో చాలామంది రైతులు తమ వద్ద ఉన్న మిర్చి టిక్కీలను కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకొని బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొన్నారు. యార్డు మూసేసే రోజుకు క్వింటా ధర రకాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ. 13వ వేల వరకు ఉంది. అయితే ఆ తర్వాత ఎక్స్‌పోర్టు క్వాలిటీ అయిన తేజ వెరైటీ మిర్చి ధర క్వింటాకు రూ.1000 పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. ఇప్పుడు చైనా నుంచి ఎక్స్‌పోర్టు ఆర్డర్స్ ఉండటంతో యార్డు తెరవగానే కొనుగోళ్ల జోరు పెంచేందుకు ఎగుమతిదారులు సిద్ధంగా ఉన్నారు.

### చెన్నై నుంచి వచ్చిన కంటైనర్లు

చైనాకు ఎక్కువగా చెన్నై, కృష్ణపట్నం పోర్టుల నుంచి మిర్చి టిక్కీలు కంటైనర్లలో ఎగుమతి చేస్తారు. ఇక్కడ కంటైనర్ లోడింగ్ అయి షిప్ ఎక్కించగానే మొత్తం నగదు ఎక్స్‌పోర్టు వ్యాపారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. దీంతో ఆయా పోర్టుల నుంచి కంటైనర్లు రెండు రోజుల క్రితమే గుంటూరు మిర్చియార్డు వద్దకు తీసుకొచ్చారు. ఎన్‌హెచ్-16 సర్వీసు రోడ్డులో వీటిని పార్కింగ్ చేసి పెట్టారు. సోమవారం కొనుగోళ్ల ప్రారంభం కాగానే రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేసి కంటైనర్లని లోడింగ్‌కు పెట్టేందుకు ఎగుమతిదారులు ఏర్పాట్లు చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో ధర పెరుగుతుందన్న ఆశాభావం ట్రేడర్లలో వ్యక్తమవుతోంది.



## తీరంలో పర్యాటకుల సందడి

బాపట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సముద్ర తీరం పర్యాటకులతో సందడిగా మారింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరానికి పర్యాటకులు వస్తూనే ఉన్నారు. ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో తీరంలో చల్లటి వాతావరణంలో కుటుంబ సభ్యులతో సేద తీరారు. చిన్నారులు కేరింతలు కొడుతూ.. ఇసుకతో ఆటలాడుతూ సంతోషంగా, సరదాగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న కొలుపులు, వేడుకలు సందర్భంగా అమ్మవారి ప్రతిమలను వాహనాలలో ఊరేగింపుగా తీసుకొచ్చి సముద్రంలో స్నానం చేయించి తీసుకెళుతున్నారు. పర్యాటకులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూరల్ పోలీసులు, మెరైన్ సిబ్బంది గజఈత గాళ్లతో గస్తీ నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. ఆదివారం పర్యాటకుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.




బ్రాడీపేట మెయిన్ రోడ్‌లో..




అరండల్ పేట వైపు రైల్వేస్టేషన్ వద్ద..




గాంధీ పార్క్ వద్ద..

## వర్షాలకు ఎగిరిపోయిన చలివేంద్రాలు

వేసవి తాపానికి పాదచారులు, వాహనదారుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు బోసిపోతున్నాయి. ఇవి ఏర్పాటు చేసిన మూడు రోజులకే వర్షాలు ప్రారంభమవడంతో వాటిని గాలికి వదిలేశారు. కొన్నిచోట్ల చలివేంద్రాలు పూర్తిగా పడిపోయాయి. గత ఐదు రోజులుగా భానుడి ప్రతాపం చూపిస్తున్నా.. కార్పొరేషన్ అధికారులు మూతపడిన చలివేంద్రాలను పునః ప్రారంభించడంలో శ్రద్ధ చూపడం లేదు.

- గుంటూరు-ఆంధ్రజ్యోతి

# శివాజ్ఞతోనే 'కన్నప్ప'ను నిర్మించాం

**ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మంచు మోహన్‌బాబు, విష్ణు**

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): శివుడి ఆజ్ఞ లేనేది ఏది తలపెట్టినా పూర్తి కాదని, ఆ శివాజ్ఞతోనే కన్నప్ప చిత్రాన్ని నేటితరం ప్రేక్షక లోకం కోసం నిర్మించామని అన్నారు చిత్ర నిర్మాత, నటులు మంచు మోహన్‌బాబు, విష్ణు. దాదాపుగా ఏడు ఎనిమిది సంవత్సరాలు కష్టపడితేనే చిత్రం విడుదలకు సిద్ధమైందని, ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని వెల్లడించారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా సినిమాని నిర్మించాయి.

ఆ పరమేశ్వరుడి ఆశీర్వదించడం వల్లే ఈ సినిమాలో గొప్ప గొప్ప నటులు, నటీమణులు ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ వంటి వాళ్లు నటించారని మోహన్ బాబు పేర్కొన్నారు. కేవలం ఒక్క ఫోన్‌కాల్, తమ మీద ఉన్న అప్యాయత, ప్రేమ, అనురాగంతోనే పాత్రల నిడివి తక్కువైనా అంత గొప్పనటులు ఈ చిత్రంలో నటించారని పేర్కొన్నారు. భక్త కన్నప్ప వచ్చి దాదాపుగా 50 ఏళ్ల పూర్తి అయిందని, కన్నప్ప కథని ఈ తరానికి చెప్పరా అని శివుడు తమను ఎన్నుకొన్నాడని తాము భావిస్తున్నామన్నారు. సినిమా షూటింగ్ అంతా న్యూజిలాండ్‌లో పూర్తి చేశామని, వీఎఫ్ఎక్స్ కోసం అమెరికాకు వెళ్లామని వెల్లడించారు. చిత్ర నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా ఎంతో అద్భుతంగా నిర్మించినట్లు వివరించారు. పది కాలాల పాటు ప్రేక్షకులు ఈ సినిమా గురించి, అందులో పాత్రలు చేసిన నటుల గురించి చెప్పుకొనేలా వచ్చిందని చెప్పారు.



ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న మోహన్‌బాబు, విష్ణు, మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావు, సినీ నటులు

### నాడు 60 అడుగుల కటౌట్‌ని తగలబెట్టారు

మోహన్‌బాబు తన అసెంబ్లీ రౌడీ చిత్రం విడుదల నాటి విశేషాలను ఈ సందర్భంగా తెలిపారు. అసెంబ్లీ రౌడీ సినిమా విడుదలైనప్పుడు 1991లో ఎన్ఎస్‌యూఐలో ఉన్న తాడిశెట్టి వెంకటరావు తన 60 అడుగుల కటౌట్‌ని గుంటూరులో తగలబెటాడని మోహన్‌బాబు గుర్తుచేశారు. దాంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో హీరో అయి ఆ తర్వాత నాయకుడిగా ఎదిగి ప్రజాదరణతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని తెలిపారు. ఇప్పుడు వెంకటరావు, ఆయన సోదరుడు మురళీ తనకు మంచి స్నేహితులై సోదరులులా ప్రేమ, అప్యాయత చూపిస్తున్నారని చెప్పారు. ఇంత పెద్ద ఈవెంట్‌ని ఎలాంటి ప్రయోజనం ఆశించకుండా నిర్వహించి విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు చెప్పారు.



గుంటూరులో కన్నప్ప యూనిట్ ర్యాలీ


### సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

బక్రీద్ పర్వదినం పోలీసులు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని విజయవంతం చేసేందుకు పటిష్ట బందోబస్తుని కల్పించారని.. ఈ విషయం తన మిత్రుడు, బంధువు సీఎం చంద్రబాబుకు తెలియకుండా జరగదని మోహన్‌బాబు పేర్కొన్నారు. ముందుగా ఆయనకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావు, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డైరెక్టర్ ముకేష్ సింగ్, కొరియోగ్రాఫర్ ప్రభుదేవా, నటులు బ్రహ్మానందం, సప్తగిరి, రఘుబాబు, అదుర్స్ రఘు, శివబాలాజీ, విశాల్ తదితరులు హాజరయ్యారు.

# పవర్ పీల్చేస్తున్నారు!

**● మండుటెండలతో పెరుగుతోన్న విద్యుత్ వినియోగం**
**● వారం రోజుల వ్యవధిలోనే గణనీయంగా పెరిగిన డిమాండ్**
**● ఉమ్మడి జిల్లాలో 21.6 మిలియన్ యూనిట్లకు చేరుతున్న వాడకం**

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపంతో ఎండలు భగ్గుమంటున్నాయి. అదే స్థాయిలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుతోంది. విభజిత గుంటూరు సర్కిల్‌తో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని విద్యుత్ డిమాండ్ రోజురోజుకు పెరుగుతోంది. విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ముఖ్యంగా వారం రోజుల వ్యవధిలోనే విద్యుత్ డిమాండ్‌ను పరిశీలిస్తే గణనీయంగా పెరిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గత నెల 31న 17.727 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం ఉండగా వారం రోజుల వ్యవధిలోనే ఈ నెల 6న 21.6 మిలియన్ యూనిట్లకు పెరిగింది. రోజు రోజుకు ఒకటి నుంచి రెండు మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరుగుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇక విభజిత జిల్లాలోని గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌ల పరిధిలో విద్యుత్ వినియోగం ఇటీవల పరిశీలిస్తే ఏ స్థాయిలో విద్యుత్ వినియోగం పెరిగిందో అర్థమవుతోంది. గత నెల 31న గుంటూరు, తెనాలి డివిజన్‌లలో 5.881 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా అది కాస్త క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఈ నెల 6న వినియోగం పరిశీలిస్తే 7.516 మిలియన్ యూనిట్లకు చేరినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా ఆ స్థాయిలో పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యాహ్నం, రాత్రిళ్లు విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం ఎయిర్ కండీషనర్లు, కూలర్లు వినియోగిస్తున్నారు. రాత్రిళ్లు ఏసీల వినియోగం పెరగటం విద్యుత్ డిమాండ్ పెరుగుదలకు కారణాలుగా చెబుతున్నారు.



### పొదుపుగా వినియోగించుకోవాలి



విద్యుత్‌ను సాధ్యమైనంత వరకు పొదుపుగా వినియోగించుకోవాలి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం సూర్య ఘర్.. ద్వారా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. మిగులు విద్యుత్‌ను విక్రయించుకోవచ్చు.

- కేవీఎల్ఎన్ మూర్తి, ఎస్ఈ, గుంటూరు సర్కిల్ ఆపరేషన్స్

# ఆర్టీసీ స్టీరింగ్ ఇన్‌చార్జిల చేతిలో..

**● రెండు డిపోలకు ఇన్‌చార్జి డిఎంలే దిక్కు ● డిప్యూటీ సీఎంఈ కూడా ఇన్‌చార్జే**

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని ఆర్టీసీ కొద్దికాలంగా ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతోంది. ఇన్‌చార్జిలతో ఒక వైపు పాలన నత్తనడకలో సాగుతుండగా మరో వైపు అధికారులకు తలకుమించిన భారంగా పరిణమిస్తోంది. జిల్లా పరిధిలో గుంటూరు- 1, 2 డిపోలతో పాటు మంగళగిరి, పొన్నూరు, తెనాలి డిపోలున్నాయి. ఐదు డిపోలుంటే రెండు డిపోల మేనేజర్లకు అదనపు విధులు కేటాయించడం విశేషం. ఇందులో గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ విదేశీ పర్యటనకు వెళ్లగా తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉండటంతో డిపో కార్యాలయంలో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ఈ డిపోలో అక్రమ ఓడీలతో కొందరు కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఇక గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం గత నెలలోనే పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో మంగళగిరి డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్యను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన రెండు డిపోలను పర్యవేక్షణ చేయాలంటే తలకుమించిన భారంగా మారుతోంది. గతంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ (డిప్యూటీ సీఎమ్ఈ)గా పనిచేసిన నర్రా వెంకటేశ్వరరావు బదిలీపై విజయవాడ వెళ్లడంతో ఆయన స్థానంలో ఎన్‌టీఆర్ బస్టాండ్ ఏటీఎంగా వ్యవహరిస్తున్న కె.సత్యనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులతో అతి పెద్దదైన ఎన్‌టీఆర్ బస్టాండ్‌కు ఏటీఎంగా ఉన్న సత్యనారాయణకు డిప్యూటీ సీఎంఈ బాధ్యతలు తలకుమించిన భారంగానే చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని డిపోలు నష్టాలతో కొట్టుమిట్టాడుతుండగా మరో వైపు ఇన్‌చార్జిల పాలన నడుస్తుండటం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది.



ఎన్‌టీఆర్ బస్టాండ్

### డిపోల్లో అధికారుల పర్యవేక్షణ ఏది...!

గుంటూరు-1, 2 డిపోలు ఇన్‌చార్జిల పాలనలో ఉండటంతో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్న విమర్శలు ఉన్నాయి. దాంతో ఈ రెండు డిపోల్లో కొందరు సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలని కోరుతున్నారు.

## ఆరుగురు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

ప్రత్తిపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో ఆరుగురు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు వచ్చినట్లు ఎంఈవో రమాదేవి తెలిపారు. ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ అవార్డులు అందాయి. ప్రత్తిపాడు శ్రీనివాస హైస్కూల్‌కు చెందిన తుమ్మపూడి ముకేష్‌రెడ్డి (586), యనమదల జడ్పీ పాఠశాలకు చెందిన గుంజి స్వర్ణ దీక్ష (585), ప్రత్తిపాడు శ్రీనివాస హైస్కూల్‌కు చెందిన కొమ్మూరి పూర్ణసాయి చైతన్య (584), అంబటి ప్రణతి (583), వంగిపురం జడ్పీ పాఠశాలకు చెందిన కూచిపూడి లికిత్ (579), యనమదల జడ్పీ పాఠశాలకు చెందిన రావూరి రోహిత్ (526)లకు ఈ అవార్డులు అందినట్లు ఆమె తెలిపారు.

● వట్టిచెరుకూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన 10వ తరగ తిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభా అవార్డుల (షైనింగ్ స్టార్స్)కు ఎంపికైనట్టు ఎంఈవో శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరికి త్వరలో అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు. ఆరు అవార్డుల్లో ముట్లూరు జడ్పీ హైస్కూల్‌కు నాలుగు, వట్టిచెరుకూరు జడ్పీ హైస్కూల్, పుల్లడిగుంట సరోజిని విద్యాలయానికి ఒక్కొక్కటి చొప్పున ఎంపికైనట్లు తెలిపారు. మండలంలోని ఆరుగురు విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికవటంపై ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దార్ దరియావలి, ఎంఈవో-1 సత్యనారాయణమూర్తి, ఎంఈవో- 2 నిర్మల, ముట్లూరు హైస్కూల్ హెచ్‌ఎం, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

## కోళ్ల జ్యోతికి ఏఎన్‌యూ పీహెచ్‌డీ ప్రదానం


కోళ్ల జ్యోతి

గుంటూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్న కోళ్ల జ్యోతికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ మేరకు వర్సిటీ రీసెర్చ్ కోఆర్డినేటర్ పీ సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీలో కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఏ కనకదుర్గ ఆధ్వర్యంలో కోళ్ల జ్యోతి పరిశోధన చేశారు. 'కోర్ బ్యాంకింగ్ సేవల నాణ్యతపై కస్టమర్ల అవగాహన' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన ప్రభుత్వ ప్రైవేటు రంగ బ్యాంకులపై ఆమె అధ్యయనం చేశారు.

## శరణాలయంలో బాలలకు అన్నదానం

మంగళగిరి సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ పోలీసు అధికారుల సంఘం సలహాదారుడు అద్దేపల్లి గణపతి తన జన్మదినం సందర్భంగా శనివారం చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో బాలబాలికలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహా ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ మేకల మోహనరావు, అడ్వొకేట్ గూడవల్లి ప్రదీప్‌కుమార్, ఏపీ జియో జీఎం ఈపూరి అనూప్, వ్యాపారవేత్త వెంకటేష్ గుప్తా, షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం ప్రతిష్ఠ

మంగళగిరి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రత్నాలచెరువులో గత 20 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరాన్ని పునర్నిర్మించి ప్రత్యేక ప్రార్థనలతో శనివారం పునఃప్రతిష్ఠించారు. అంతర్జాతీయ సువార్తీకులు హోసన్నా మినిస్ట్రీస్ దైవ సేవ కుడు పాస్టర్ జాన్‌వెస్లీ హాజరై సందేశం అందించారు. దేవుని మందిరం ప్రజల ప్రవ ర్తనలో మార్పు తీసుకువస్తుందని, ప్రతి ఒక్కరూ దేవుని మాటలను ఆచరించి సత్ప్ర వర్తనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఫెలోషిప్ కార్య దర్శి ఎస్.మోజెస్, పాస్టర్ అబ్రహం, భాగ్య రావు, పెనుయేలు, మాదాసు విజయకు మారి, పీ.తిమోతి, కే.దేవభూషణం, కే.ఆల్ఫా, జాన్ లూయిస్, పాల్ శౌరి పాల్గొన్నారు.

# నిరుపయోగంగా రూ.4 కోట్ల భవనాలు


నిరుపయోగంగా ఉన్న భవనాల సముదాయం(ఫైల్‌ఫొటో)


తలుపులు తెరుచుకోని పరిపాలనా భవనం (ఫైల్‌ఫొటో)

తాడికొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య వైద్యశాల భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రోగులకు మెరుగైన సేవలు అందించడానికి తాడికొండలోని గ్రామీణ ఆరోగ్యకేంద్రంలో రూ.4 కోట్లతో వైద్యశాల ఆదనపు భవనం, వైద్య విద్యార్థుల వసతి గృహం, వైద్యుల నివాస గృహం, లెక్చర్ గ్యాలరీ వంటి పలు సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించారు. 2014-19 టీడీపీ, బీజేపీ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రకాష్ నడ్డా, అప్పటి రాష్ట్ర వైద్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లు అట్టహాసంగా భవనాలను ప్రారంభించారు. గుంటూరు మెడికల్ కళాశాల అనుబంధంగా కొనసాగుతున్న గ్రామీణ ఆరోగ్యకేంద్రంలో గతంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, హౌస్ సర్జన్ల ఉండి రోగులకు సేవలు అందించేవారు. తాడికొండ చుట్టు పక్కల గ్రామాల నుంచి ఇక్కడి వచ్చి రోగులు వైద్య సేవలు పొందేవారు. రాను రాను వైద్యులు, హౌస్ సర్జన్లు రావటం తగ్గిపోవటంతో రోగుల సంఖ్యకూడా గణనియంగా తగ్గిపొయింది. రోగులకు మెరుగైన సేవలు అందించటానికి నూతన భవనాలను నిర్మించారు. మెడికల్ ఆఫీసర్లు, హౌస్ సర్జన్లు స్థానికంగా నివాసం ఉంటు రోగులకు అందుబాటులో ఉండటానికి నూతన భవనాలను నిర్మించారు. శిక్షణ నిమిత్తం వచ్చే హౌస్ సర్జన్లు నామమాత్రంగానే విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. హౌస్ సర్జన్లు స్థానికంగా ఉండి గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించాల్సి ఉన్నది. స్థానికంగా ఉండి వైద్య సేవలు అందించాల్సిన వైద్యాధికారులనే డిప్యుటేషన్ పద్ధతిలతోనియమించడంతో వారు కూడా అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో పేదలకు వైద్య సదుపాయం అందని ద్రాక్షలానే మిగిలిపోతుంది. చాలా మంది రోగులు గుంటూరు, మంగళగిరి, విజయవాడలకు వైద్య సేవలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే హౌస్ సర్జన్లకు క్లాసులు నిర్వహించటానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు. కరోన కాలంలో క్వారంటైన్ కేంద్రంగా ఆర్‌హెచ్‌సీని ఉపయోగించారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిని ఆరోగ్య కేంద్రంలోని భవనాలు ఉపయోగించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు


మంగళగిరి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


దుగ్గిరాలలోని ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

మంగళగిరి సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళగిరి ఈద్గాలో సామూహిక నమాజ్, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఉదయం నుంచే ముస్లింలు మసీదుల వద్దకు చేరుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో నమాజ్ ఆచరించారు. నిడమర్రు రోడ్డులోని మసీద్-ఏ-అన్వరీ ఆధ్వర్యంలో జరిగిన నమాజ్‌లో పండుగ విశిష్టతను తెలియ జేశారు.

● దుగ్గిరాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్‌ను శనివారం ఘనంగా జరుపుకున్నారు. దుగ్గిరాల, పెనుమూలి, కేఆర్ కొం డూరు, చిలువూరు, తుమ్మపూడి, తదితర గ్రామాల్లోని ముస్లింలు, ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మహ్మద్‌ప్రవక్త చెప్పిన విధంగా త్యాగాలను గుర్తుచేసుకుం టూ, స్వార్థాన్ని విడనాడాలని మదపెద్దలు బోధించారు.

● తాడికొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక బక్రీదు అని ముస్లీం మత పెద్దలు పేర్కొన్నారు. శనివారం బక్రీద్ సం దర్భంగా భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకున్నా రు. ఈద్గా, మసీదుల్లో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. తాడికొండ, లాం, బేజాత్‌పురం, పొన్నెకల్లు, రావెల తదితర గ్రామాల్లో ఈద్గాలకు సామూహికంగా వెళ్లి ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● బక్రీదు సందర్భంగా టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ముస్లింలకు మజ్జిగ పంపిణీ చేశారు. బక్రీదు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ సెల్ నాయకులు షేక్ బిలాల్, టీడీపీ నాయకులు ధనేకుల హరిబాబు, వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఫిరంగిపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీదు పర్వదినాన్ని శనివారం ఫిరంగిపురంలో ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం మత పెద్దలు బక్రీదు విశిష్టతను భక్తులకు వివరించారు.

● కాకుమాను, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ సహనం, ఐకమత్యానికి, త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని టీడీపీ నాయకులు అన్నారు. మండల వ్యాప్తంగా శనివారం బక్రీద్ పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదులలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

● పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. త్యాగానికి ప్రతీకగా ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారు. ఈద్గాలు, మసీదులు వద్ద ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# కేఎల్‌యూలో ఉద్యోగాల పండుగ


యశస్వినికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ప్రసాద్

తాడేపల్లి(వడ్డేశ్వరం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థుల హవా కొనసాగుతోంది. మేనేజ్‌మెంట్, హ్యూమనిటీస్, సైన్స్, ఫార్మసీ ఇతర డిగ్రీ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు సైతం 155కు పైగా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని వీసీ సారధివర్మ తెలిపారు. శనివారం యూనివర్సిటి ప్రాంగణంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ సక్సెస్‌మీట్‌కు ఆయా కంపెనీలకు చెందిన సీఈవోలు బొల్లినేని సురేష్ బాబు, పీ వేణుగోపాలరావు, శామ్యూల్ ఫిలిప్ బాబు, వీఎస్‌ఆర్ ప్రసాద్ ఓరుగంటి, రామచందర్, సౌందర్‌రాజన్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో తరలివచ్చిన తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి కేఎల్‌యూ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. వీసీ సారధివర్మ మాట్లాడుతూ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు కేఎల్‌యూ అధిక ప్రాధాన్యం ఇస్తుందని అందులో భాగంగానే 450కి పైగా జాతీయ కంపెనీలు 50కు పైగా అంత ర్జాతీయ కంపెనీలు ప్రాంగణ ఎంపికల కోసం తమ యూనివర్సిటికి వచ్చాయని వెల్లడించారు. 155కు పైగా కంపెనీల్లో 1500 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు రాగా 1087 మంది స్వీకరించారన్నారు. ప్రోవీసీ వెంకట్రామ్ మాట్లాడుతూ కేఎల్‌యూలో 15కు పైగా కంపెనీలు ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇప్పటికే మూడు కంపెనీలు ఏర్పాటయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రోవీసీలు ప్రసాద్, వెంకటరా మ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్ డీన్ ఎం కిషోర్‌బాబు, అకడమిక్ అడిషనల్ డీన్ హరికిరణ్ వేగే, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ శ్రీనాథ్, ప్లేస్‌మెంట్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ పి చలపతి, సీనియర్ డైరెక్టర్ శరవణబాబు, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్, ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్ర మంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొని ఆరుగురికి మొత్తం రూ.8లక్షల విలువ కల్గిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇమ్మడి మల్లేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి వికసిత్ కృషి సంకల్ప యాత్రలు

● సీనియర్ శాస్త్రవేత్త గంగాదేవి

ప్రత్తిపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం వికసిత్ కృషి సంకల్ప యాత్రలను నిర్వహిస్తున్నట్లు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎం గంగాదేవి తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, లాంఫామ్‌లు సంయుక్తంగా ప్రత్తిపాడులో రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గంగాదేవి మాట్లాడుతూ జూన్ 12వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా 700 గ్రామాల్లో 2వేల మంది శాస్త్రవేత్తలతో వికసిత్ కృషి సంకల్ప యాత్రలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లాలోని వివిధ గ్రామాల్లో భూసార పరీక్షలు, కొత్త వంగడాలు, సస్యరక్షణతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీటీఆర్‌ఐ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమమే సమాఖ్య లక్ష్యం

● రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణజాతి సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ తెలిపారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో సమాఖ్య 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన నూతన పతాకాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయ కమిటీల చైర్మన్ పదవులలో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని కోరారు. ముందుగా గుంటూరు అన్నదాన సమాజం చైర్మన్ పదవి బ్రాహ్మణులకు కేటాయించాలని కోరారు. సినిమాలలో బ్రాహ్మణ జాతిని చులకన చేసి చూపిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమాఖ్య నూతన వెబ్‌సైట్‌ను సమాఖ్య కోశాధికారి పులిపాక ప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కేవీఎల్ రామచంద్ర మూర్తి, వెలవర్తిపాటి పాండురంగ విఠల్, శంకరమంచి లలిత శాస్త్రి, మాచిరాజు మురళీకృష్ణ, కుందేటి సుబ్రహ్మణ్యం, నేపాక పద్మావతి తదితరులున్నారు.

# ఇన్నర్ రింగురోడ్డుకు మోక్షం లేదా..?

● దుమ్ము ధూళితో అల్లాడుతున్నాం
● ప్రజా ప్రతినిధులకు స్థానికుల మొర
● పట్టించుకోని సీఆర్‌డీఏ అధికారులు


రూపు రేఖలు కోల్పోయిన ఇన్నర్ రింగు రోడ్డు

మేడికొండూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు, అంకిరెడ్డిపాలెం గ్రామాల మీదుగా నేషనల్ హైవే 16 ను కలిసే మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు రూపురేఖలు కోల్పోవడంతో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రహదారిలో ఏర్పడిన గోతుల కారణంగా వాహన డ్రైవర్లతో పాటు స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ రహదారిలో ఏర్పడిన గోతుల కారణంగా వాహనాలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని వాహన డ్రైవర్లు మొరపెట్టుకుంటున్నారు. అంతేకాకుండా తారు రోడ్డు రూపు రేఖలు కోల్పోయి మట్టి రోడ్డుగా మారింది. ఫలితంగా గాలిలోకి చేస్తున్న దుమ్ము, ధూళి కారణంగా సమీప గృహాల వాసులు అనారోగ్యం భారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రజల నుంచి వాహన డ్రైవర్ల నుంచి ఎన్ని ఫిర్యాదులు అందినా సీఆర్‌డీఏ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నారు. గుంటూరు, ఆటోనగర్ నుంచి నేషనల్ హైవేని కలిపే మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్‌రోడ్డు నాలుగు దశలుగా నిర్మించిన సంగతి అందరికీ తెలిసిందే. నాలుగో దశ కింద నల్లపాడు నుంచి అంకిరెడ్డిపాలెం గ్రామాల మీదుగా 16వ నెంబరు జాతీయ రహదారికి రోడ్డును సుమారు 20ఏళ్ల క్రితం నిర్మించారు.. అంతవరకు బాగానే ఉన్నా గత కొన్నేళ్లుగా ఈ రహదారికి ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారి మట్టి రోడ్డుగా మారింది. ఈ రోడ్డులో ఏర్పడిన గుంతల కారణంగా వాహనాలు గుల్లవుతున్నాయని వాహన డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి విషయంపై కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తదితరులను స్థానికులు ఐక్యంగా వెళ్లి రహదారికి మరమ్మతులు చేయించాలని విన్నవించారు. గుంటూరు నగర సమీపంలో16వ నంబరు జాతీయ రహదారిని చేరాలనుకునే వారికి ఈ రహదారి అనువుగా ఉండటంతో ఎక్కువ శాతం వాహనాలు ఈ రహదారి మీదుగా వెళుతుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి సీఆర్‌డీఏ అధికారులు పట్టించుకోవడం లేదని, కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో గతంలో వేసిన తారు రోడ్డు ప్రస్తుతం మట్టి రోడ్డు రోడ్డుగా మారిపోయిందని, తాము ఈ రహదారి పక్కన ఉండలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### డంపింగ్ యార్డ్‌గా..

ఇన్నర్ రింగు రోడ్డు రూపురేఖలు మారిపోయి గుంతల మయమై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో భారీ వాహనాలు, లారీలు మాత్రమే ఈ రహదారిలో ప్రయాణిస్తున్నాయి. నల్లపాడు సమీప గ్రామాల నుంచి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించే వాహనాలు సైతం ఈ రహదారిలో వెళ్లలేకపోతున్నాయి. రోడ్డుపక్కనే చెత్తను వదిలేసి వెళుతున్నారు. ఫలితంగా రోడ్డుకు ఇరువైపులా చెత్త, వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి డంపింగ్ యార్డ్‌గా మారిపోయింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజల నుంచి పదేపదే వచ్చిన విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సీఆర్‌డీఏ అధికారులకు సమాచారం అందించి వెంటనే రిపేర్లు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి నల్లపాడుకు రానున్న మంత్రి చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులకు మరోసారి విన్నవించాలని స్థానికులు సిద్ధమవుతున్నారు. సంబంధిత సీఆర్డీఏ అధికారులు దృష్టి సారించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రెండు గ్రామాలకు తీరనున్న దాహార్తి

● నాగులపాడు, పెదనందిపాడులకు అప్పాపురం కెనాల్ నీరు
● వైసీపీ పాలనలో మరుగున పడిన పైలెట్ ప్రాజెక్ట్
● కూటమి చొరవతో మోక్షం


అప్పాపురం ఛానల్ పైప్‌లైనుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పెదనందిపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు, నాగులపాడు గ్రామాలకు తాగునీరు అందించే అప్పాపురం పైలెట్ ప్రాజెక్టుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో మరుగున పడిన అప్పాపురం పైలెట్ ప్రాజెక్టును కూటమి వినియోగంలోకి తీసుకొస్తుంది. ఇందుకు పెదనందిపాడు రైతులు ముందుకు వచ్చి అప్పాపురం నుంచి పెదనందిపాడు వరకు పైపులైన్లు మరమ్మతు పనులు చేపడుతున్నారు. మరో వారం రోజుల్లో ఈ ప్రాంతానికి అప్పాపురం కెనాల్ నీరు రానున్నట్లు వారు తెలిపారు. ఆరేళ్లగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్టును కూటమి తిరిగి ప్రారంభించడంతో తమ తాగునీటి వెతలు తీరనున్నాయి అంటూ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అమరావతి పై వ్యాఖ్యలు సిగ్గుమాలిన చర్య

గుంటూరు సిటీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జగన్‌కు చెందిన ఛానల్‌లో అమరావతి వేశ్యల రాజధాని అంటూ తప్పుడు వ్యాఖ్యలు చేయటం సిగ్గుమాలిన చర్య అని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. గుంటూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరావతిపై తప్పుడు వ్యాఖ్యలు చేసి ఐదు కోట్ల మంది ప్రజల మనోభావాలను జగన్ ఛానల్ దెబ్బ తీసిందని అన్నారు. ఆ వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సదరు ఛానల్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు.

## తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


ఎస్‌ఐ జోజిబాబుకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

తాడికొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని మహిళలను వేశ్యలు అని సాక్షి టీవీలో సంబోధించిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, వీవీఆర్ కృష్ణంరాజు, సాక్షి అధినేత వైఎస్ భారతీపై తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో మహిళలు, టీడీపీ, బీజేపీ నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి షేక్ రిజ్వాన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్‌లు అమరావతి మహిళలు దేవతలు అని చెప్పగా దానికి వ్యతిరేకంగా సాక్షి టీవీలో అమరావతి మహిళలను కించపరిచే విధంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై అసభ్యంగా మాట్లాడటం దుర్మార్గమైన చర్యగా భావించి న్యాయస్థానాల ద్వారా కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌ఐ జోజికి ఫిర్యాదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు, గుంటూరు బీజేపీ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి మహిళలను కించపరిచే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

● సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ

తుళ్లూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను కించపరచే విధంగా సాక్షి ఛానల్‌లో మాట్లాడిన జర్నలిస్ట్ కృష్ణంరాజు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నేతాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చరిత్రలో అమరావతికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. బౌద్ధ క్షేత్రంగానూ, ఒకప్పటి రాజ్య రాజధానిగాను అమరావతి ఉందని తెలిసిందేనన్నారు. బహుశా ఆ కారణంగానే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజధాని పేరును అమరావతిగా నిర్ణయించడాన్ని రాష్ట్రంలోనూ దేశంలోనూ అనేక మంది హర్షించారన్నారు. తదనంతరం గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని తరలింపు నిర్ణయం చేసినపుడు దానికి వ్యతిరేకంగా అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని కోరుతూ జరిగిన ఉద్యమంలో మహిళలు ప్రధాన భూమిక పోషించారన్నారు. ఇలాంటి నేపథ్యంలో ఒక టీవీ ఛానల్ చర్చలో అమరావతిని వేశ్యల రాజధాని పేర్కొంటూ వ్యాఖ్యానించడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఇది రాజధాని ప్రాంత ప్రజలను, మహిళలను అవమానించడం మాత్రమే కాక మొత్తం ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకాన్ని అవమానించడంగా భావించాల్సి వస్తుందని, ఈ వాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తుందని నేతాజీ అన్నారు.

## ఈమనిలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఈమనిలో జడ్పీ హైస్కూల్లో గురువులతో కలిసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 బ్యాచ్ విద్యార్థులు

దుగ్గిరాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఈమనిలోని జడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరుపుకున్నారు. పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు, తమకు విద్యనేర్పిన గురువులను ఆహ్వానించి, వారిని ఘనంగా సత్కరించారు. తాము విద్య నేర్చిన కాలంలో స్నేహితులతో అనుభవాలను పంచుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

## నేడు ప్రపంచ ప్రార్థనా దినోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధులు

మంగళగిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రార్థనా దినోత్సవం, పెంతెకొస్తు పండుగ వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్నట్టు క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధి పీ తిమోతి తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళ గిరి రత్నాలచెరువులోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో శనివారం జరిగిన దైవ సేవకుల సమావేశంలో ఆవిష్కరించారు. తిమోతి మాట్లాడుతూ పెంతెకొస్తు పండుగ క్రైస్తవ్యంలో ముఖ్యమైన పండుగ అన్నారు. ప్రపంచ సువార్తీక రణకు గుర్తుగా పండుగను జరుపుకుంటామని, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని తెలియజేశారు. క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యం లో ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు మంగళగిరి టిప్పర్ల బజారులోని అంజుమన్ షాదీఖానాలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు మోజెస్, మోషే, జీ దేవరాజు, కే దేవభూషణం, వై జీవన్‌బాబు, జాన్ లూయిస్, ప్రభుకుమార్, మేకల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

# తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



## సీనియర్ సిటిజెన్స్‌కు ప్రత్యేక యోగా శిక్షణ శిబిరం

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజెన్స్‌కు ఆదివారం ప్రత్యేక యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. స్థానిక కొత్తపేటలోని శ్రీ రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 6.30 గంటలకు సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక యోగా శిక్షణ, సాధన ఉంటుందని, పెద్దలందరూ పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్లు, మాజీ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొనాలని పెన్షనర్స్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణమూర్తి, సూర్యప్రకాశరావు, హృదయరాజు మరో ప్రకటనలో కోరారు.

## డాక్టర్ నాగమల్లేశ్వరరావు మృతికి వైద్యుల సంతాపం

తెనాలి అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గుండె వ్యాధి వైద్య నిపుణుడు గద్దె శివనాగమల్లేశ్వరరావు మృతి పట్ల వైద్యులు సంతాపం తెలిపారు. బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అనీల్‌కుమార్ మాట్లాడుతూ, తెనాలి పట్టణంలో గుండె వ్యాధిగ్రస్తులకు సేవలు అందించారని, ఇతర ప్రాంతాలకు పోకుండా ఆయన మంచి వైద్యం చేశారని చెప్పారు. కరోనా సమయంలో వయోభారాన్ని లెక్క చేయకుండా వైద్యసేవలు అందించారని కొనియాడారు. వైద్యులు పావని ప్రియాంక, శ్యాంప్రసాద్, కోటినాగయ్య, చందు సాంబశివుడు, శేషగిరిరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి



కారుమూరి ధనం బాబు( ఫైల్)

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేబ్రోలులో విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. చేబ్రోలు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం చెన్నారెడ్డి కాలనీకి చెందిన కారుమూరి ధనంబాబు(80) రైతు కూలీగా పని చేస్తున్నాడు. శనివారం ధనంబాబు ఇంటి వద్ద మోటార్ స్విచ్ ఆన్ చేయడానికి ప్రయత్నించిన క్రమంలో విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ధనంబాబు మృతితో కొత్తరెడ్డిపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడు ధనంబాబుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## పాత్రికేయ వృత్తికి తలవంపులు తెచ్చారు..

తెనాలి అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఒక పత్రికకు ఎడిటర్‌గా ఉన్న కృష్ణంరాజు పాత్రికేయ వృత్తికి తలవంపులు తెచ్చారని ఏపీ యూడబ్ల్యూజే నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు చందు సుబ్బారావు పేర్కొన్నారు. రాజధానిపై ఆయన చేసిన వ్యాఖ్యలకు శనివారం జరిగిన సమావేశంలో తీవ్రంగా ఖండించారు. తక్షణమే రాజధాని ప్రాంత మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి గోపిచంద్, కోశాధికారి తారక్ సాయినాథ్, చొప్పర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లపై పోలీసుల చర్యలు సరికాదు

తెనాలి అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లను నడిబజారులో లాఠీలతో కొట్టడం సరికాదని న్యాయవాది పెరికల డానియేల్ పేర్కొన్నారు. అంబేద్కర్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పద్ధతిలోనే పోలీసులు వ్యవహరించాలన్నారు. శాంతిబాబు, రామరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.



అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ రాయపాటి

## బ్రాహ్మణ సంక్షేమమే సేవా సంఘ సమాఖ్య లక్ష్యం

● రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ

గుంటూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణజాతి సంక్షేమమే ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ తెలిపారు. ఇన్నర్‌రింగ్ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో సమాఖ్య 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన నూతన పతాకాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయ కమిటీల ఛైర్మన్ పదవులలో బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని కోరారు. ముందుగా గుంటూరు అన్నదాన సమాజం ఛైర్మన్ పదవి బ్రాహ్మణులకు కేటాయించాలని కోరారు. సినిమాలలో బ్రాహ్మణ జాతిని చులకన చేసి చూపిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమాఖ్య నూతన వెబ్‌సైట్‌ను సమాఖ్య కోశాధికారి పులిపాక ప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కేవీఎల్ రామచంద్రమూర్తి, వెలవర్తిపాటి పాండురంగ విఠల్, శంకరమంచి లలిత శాస్త్రి, మాచిరాజు మురళీకృష్ణ, కుందేటి సుబ్రహ్మణ్యం, నేపాక పద్మావతి తదితరులున్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీదు ప్రార్థనలు



కొల్లిపరలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తెనాలిరూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా బక్రీదు పండుగ నిలుస్తుందని కొలకలూరు అంజుమన్ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు షేక్ అజీజ్ చెప్పారు. శనివారం ఈద్‌ఉల్ అద్హా (బక్రీద్) పండుగను పురస్కరించుకుని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మజీద్ పెద్దలు హాజీ మహమ్మద్ హనీఫ్, హాఫీజ్ లియాఖత్, హాకీమ్‌లు బక్రీదు పండుగ విశిష్టతను తెలిపారు. గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, గ్రామ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కరిముల్లా, నల్లిబోయిన నాగేశ్వరరావు, గుంటూరు కృష్ణమోహన్ పలువురు కూటమి నాయకులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి షేక్ అమీర్‌బాషా, సహాయ కార్యదర్శి పఠాన్ కరిముల్లా, కోశాధికారి ఎండీ ఇక్బాల్‌బాషా పర్యవేక్షణలో ప్రార్థనలు జరిగాయి.

### కొల్లిపర మండలంలో...

కొల్లిపర, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఈద్గాలకు వద్దకు చేరుకుని ప్రార్థనలు చేశారు. మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, తూములూరు, దావులూరు గ్రామాల్లోని ముస్లింలు బక్రీద్ వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఖుర్బానీ చేసి కుటుంబ సభ్యులకు, బంధువులకు పంచిపెట్టారు. తమ శక్తి కొలది పేదవారికి దానం చేశారు.



ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

## త్యాగానికి ప్రతీక బక్రీద్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ సహనం, ఐకమత్యానికి, త్యాగానికి ప్రతీక అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో శనివారం బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదులలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పట్టణంలోని అబ్దుల్ కలాం మార్గ్‌లో ఉన్న ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బక్రీద్ పండుగ విశిష్టతను మత పెద్దలు తెలియజెప్పారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే హజరత్ ఇబ్రహీం, ఇస్మాయిల్‌లను గుర్తు చేసుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అల్లా పెట్టిన పరీక్షలలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా త్యాగాలు చేసిన తండ్రి, కుమారులను స్మరిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ బేగ్ అంజుమన్ కమిటీ ద్వారా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి వచ్చిన విరాళాల వివరాలను వెల్లడించారు. అలాగే కమిటీ ద్వారా ముస్లిం పేద విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని వెల్లడించారు. ప్రార్థనల అనంతరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు బక్రీద్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ముస్లిం, మైనార్టీ నాయకుల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని చౌక్ మసీదు, దాహెరా మసీదు, ఎస్సీపీ రోడ్డులోని మసీదు, జీబీసీ రోడ్డులోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఖుర్బానీ పంచి పండుగ నిర్వహించారు. మండల పరిధిలోని వడ్డిముక్కల, మన్నవ, చింతలపూడి తదితర గ్రామాలతో పాటు చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, వడ్లమూడి, వేజెండ్ల, గొడవర్రు, నారాకోడూరు గ్రామాలలోని ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత పెద్దలు ఖురాన్‌లోని నీతి సూక్తులను బోధించారు.

# ఆయుర్వేద వైద్యం.. దూరం

● వల్లభరావుపాలెంలో ఆసుపత్రికి తాళం

● తాళ్లపాలెంలో శిథిలస్థితికి చేరుకున్న ఆసుపత్రి



శిథిల స్థితికి చేరుకున్న తాళ్లపాలెంలోని జీఆర్ దాస్ ఆయుర్వేద వైద్యశాల

పొన్నూరుటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): భారతీయ సాంప్రదాయ వైద్య పద్ధతి ఆయుర్వేద వైద్యానికి నానాటికి ఆదరణ తగ్గుతుంది. దేశంలో మూడు వేల సంవత్సరాల క్రితమే ఆయుర్వేద వైద్యం ఏర్పడి ప్రజలకు వైద్యం అందినట్లు అనేక గ్రంథాల ద్వారా తెలుస్తోంది. వేద కాలం నుంచి ప్రజలకు వైద్యం అందించిన ఆయుర్వేదం నేడు అనేక సమస్యలతో కునారిల్లుతోంది. ఆయుర్వేద వైద్యంలో ధన్వంతరి, చరకుడు, శుశ్రుథ వంటి ఆయుర్వేద వైద్య పితామహుల ద్వారా దేశంలో విశేష ప్రాచుర్యం పొందింది. వైద్య పితామహుడు ధన్వంతరి అనేక రుగ్మతులకు ప్రకృతి ప్రసాదించిన వనమూలికలతో మందులు తయారీ చేసి చికిత్సలు అందించేవారు. ధన్వంతరి చరకుడు అనుసరించి వైద్యం అందించడమే కాకుండా చరక సంహిత గ్రంథం ద్వారా ప్రపంచ మానవాళికి ఆయుర్వేద వైద్యాన్ని అందించారు. తరువాత కాలంలో శుశ్రుతుడు వేల ఏళ్ల క్రితమే చికిత్సలతో పాటు శస్త్ర చికిత్సలు చేసి వ్యాధులను నయం చేసినట్లు శుశ్రుత సంహిత ద్వారా ప్రపంచానికి బహిర్గతం అయింది. ఘన చరిత్ర ఉన్న ఆయుర్వేద వైద్యం నేడు సరైన సౌకర్యాలు లేక ప్రజాదరణ ఉన్నప్పటికి ప్రాచుర్యం లభించక కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది.

### మండలంలో మూడు ఆయుర్వేద వైద్యశాలలు

పొన్నూరు మండలంలో అనేక దశాబ్దాల క్రితమే ఏర్పాటు అయిన ఆయుర్వేద వైద్యశాలలు క్రమంగా మూత పడే స్థితికి చేరుకున్నాయి. వల్లభరావుపాలెం గ్రామంలో 1976లో ఏర్పాటైన వైద్యశాలకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో తాళం వేశారు. అలాగే స్వాతంత్ర్యానికి పూర్వమే మహాత్మా గాంధీ ప్రియ శిష్యుడు జీఆర్ దాసు తాళ్లపాలెం గ్రామంలో ఆయుర్వేద వైద్యశాలను ప్రారంభించారు. స్వయంగా జాతిపిత ఈ వైద్యశాలను సందర్శించారు. 1976లో తాళ్లపాలెంలో వైద్యశాలకు పక్కా భవనం నిర్మించినప్పటికి.. కాల క్రామేణ వైద్యశాల మరమ్మతులకు గురై శిథిలమైపోయింది. ఈ వైద్యశాలకు కూడా వైసీపీ ప్రభుత్వంలో వైద్యులను, సిబ్బందిని బదిలీ చేయడంతో మూతపడింది. మూడు నెలల క్రితమే ఆయుష్ శాఖ ఒక వైద్యురాలిని నియమించడంతో ఆసుపత్రి ద్వారాలు తెరచుకున్నాయి. సహాయక సిబ్బంది లేకపోవడంతో వైద్యురాలు కుటుంబ సభ్యుల సహకారంతో వైద్య సేవలు, మందులను గ్రామస్థులకు అందిస్తున్నారు. బ్రాహ్మణకోడూరు గ్రామంలో వైద్యశాలలో వైద్యులు ఉన్నప్పటికి ఆదరణ కరువైంది. సైడ్ ఎఫెక్ట్‌లు లేని ఖర్చు తక్కువైన ఆయుర్వేద వైద్యాన్ని అనేక మంది సామాజిక మాధ్యమాల ద్వారా అనుసర్తిన్నప్పటికి వైద్యశాలల్లో సౌకర్యాలు లేమి వైద్యులు లేమి కారణంగా.. ఆసుపత్రులకు ఆదరణ కరువు అవుతోంది. ఇప్పటికైన ప్రభుత్వం ఆయుష్ శాఖ ద్వారా ఆయుర్వేద వైద్యం సరైన ప్రాచుర్యం కల్పించడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామాల వాసులు కోరుకుంటున్నారు.



వైద్యశాలలో మందులు



తాళం వేసిన వల్లభరావు పాలెం ఆయుర్వేద వైద్యశాల

## ఆకుకూరలకు పెరిగిన డిమాండ్

● సాగుపై శ్రద్ధ చూపుతున్న రైతులు



కోతకు సిద్ధమైన గోంగూర



ఏపుగా పెరుగుతున్న తోటకూర

కొల్లిపర, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ఆకుకూర ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు వాటి సాగు పట్ల మరింత శ్రద్ధ చూపుతున్నారు. వేసవి కావడంతో పట్టణ, గ్రామీణ ప్రజలు ఎక్కువగా ఆకుకూరలను కొనుగోలు చేయడంతో మరింత డిమాండ్ పెరిగింది. దీంతో రైతులు ఆకుకూరల సాగుపై మక్కువ చూపుతున్నారు. మండలంలో వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, అన్నవరంగౌడపాలెం, అన్నవరం, దావులూరిపాలెం, దావులూరు తదితర గ్రామాలకు చెందిన రైతులు తక్కువ కాలంలో చేతికి వచ్చే ఆకుకూర రకాలైన తోటకూర, గోంగూర, చుక్కకూర, పాలకూర వంటి రకాలను సాగు చేయటానికి సిద్ధపడుతున్నారు. మే నెలలో కొంతమంది రైతులు మాగాణి భూములను దుక్కిదున్ని చిన్న, చిన్న కమతాలుగా చేసి గోంగూర, తోటకూర విత్తనాలు చల్లారు. కూరగాయల ధరలు ఎక్కువగా ఉండటంతో ఎక్కువ మంది ప్రజలు ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

# వైభవంగా సరస్వతీ దేవాలయ భూమిపూజ



భూమి పూజ చేస్తున్న బాలస్వామి, శ్రీవాసుదేవానందగిరిస్వామి, శ్రీమన్నారాయణ అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి తదితరులు

తెనాలి, మారీసుపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వైభవంగా శ్రీసువర్ణ భారతీ క్షేత్రం (సరస్వతీ దేవాలయం)కు భూమి పూజా కార్యక్రమాన్ని శ్రీవిద్యాపీఠం ట్రస్ట్, సాలిగ్రామ మఠం టస్ట్ సభ్యులు నిర్వహించారు. శనివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ వివేకానంద సెంట్రల్ స్కూల్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న సువర్ణ భారతీ క్షేత్రం (సరస్వతీ దేవాలయం) కు భూమి పూజను పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో వైభవంగా శ్రీవిద్యాపీఠం, సాలిగ్రామ ట్రస్ట్ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దపులిపాక శ్రీవిద్యాపీఠం శ్రీవాసుదేవానందగిరి స్వామి, విజయవాడ అష్టాక్షరి ఆశ్రమం శ్రీమన్నారాయణ అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి పాల్గొని దేవాలయ భూమి పూజను నిర్వహించారు. బాలస్వామి విశేష హోమాలు, పూజలను నిర్వహించి ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, దాసప్రాజెక్ట్ కృష్ణ, గుంటూరు జిల్లా అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి రావూరి సుబ్బారావు, ముద్దాబక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

● అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నాన్ పొలిటికల్ జేఏసీ ఫిర్యాదు

గుంటూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రాజధాని మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అమరావతి పరిరక్షణ సమితి నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అమరావతి రాజధాని ప్రాంత మహిళలను అవమానపరిచే విధంగా సాక్షి టీవీలో జర్నలిస్ట్‌గా చెప్పుకొనే కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో అమరావతి పరిరక్షణ సమితి నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిర్యాదు చేసింది. రాజధాని మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వేశ్య శిబిరాలు అమరావతి చుట్టూ ఎక్కువగా ఉన్నాయని కృష్ణం రాజు అనడంపై అమరావతి జేఏసీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అమరావతి దేవతల రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబు అనడం హాస్యాస్పదంగా ఉందని కృష్ణంరాజు అనడం దారుణమన్నారు.



# మాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలి

● ఐక్యవేదిక నాయకుల ఆందోళన

● నేడు డీఈవో కార్యాలయ ముట్టడికి పిలుపు

గుంటూరు(విద్య),జూన్ 7(ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీటీలకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వెబ్ ఆప్షన్ పెట్టుకో వాలని విద్యాశాఖ అధికారులు సూచించడం దారుణమని, ఇందుకు నిరసనగా ఆదివారం కార్యాలయ ముట్టడి నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రకటించారు. శనివారం ఎస్‌జీటీలకు ఫోన్ చేసి బలవంతంగా వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడం తగదని సూచించారు. ఇందుకు నిరసనగా గుంటూరు ఎంఈవో కార్యాల యం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన నిర్వ హించారు. స్టీరింగ్ కమిటీ నాయకులు కె.బసవలింగారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు రాష్ట్ర ఐక్య వేదికకు ఇచ్చిన హామీ మేరకు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెబ్ కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. స్టీరింగ్ కమిటీ నాయకులు ఎం.కళాధర్, పెదబాబు, శ్రీనివాస్, సంపత్, శ్రీనివాసరావు, సుధీర్‌బాబు, హనుమంత రావు, సుబ్బరెడ్డి, రమేష్, ఆదినారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

● సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ

పెదకాకాని, జూన్ 7( ఆంధ్రజ్యోతి): పెదకాకాని గ్రామ ప్రజలకు మౌలిక వసతులు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. శనివారం ఆయన సుందరయ్య కాలనీ, స్వర్ణపురి కాలనీ, ఎస్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ, స్వర్ణపూరి కాలనీ, శ్రీలక్ష్మీదుర్గ ఎస్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, జాన్ హస్పర్ తదితర కాలనీలలో నివాసం ఉంటున్న వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గ్రామాల్లో ఇళ్లస్థలాలు లేని పేదలు 2000 మందికి పైగా ఉన్నారని, వారికి ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈనెల 9న పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజా రమేష్, బురదగుంట సాంబయ్య, ఆర్ వెంకటేశ్వర్లు, కాలనీవాసులు జెట్టి రాజలక్ష్మి, కె.పానకాలు వెంకట్రావు, ఎం వెంకాయమ్మ, షేక్ మస్తానమ్మ, దోసర మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ

## కోళ్ల జ్యోతికి ఏఎన్‌యూ పీహెచ్‌డీ ప్రదానం



కోళ్ల జ్యోతి

గుంటూరు(విద్య), జూన్ 7(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకురాలుగా పనిచేస్తున్న కోళ్ల జ్యోతికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈ మేరకు వర్సిటీ రీసెర్చ్ కోఆర్డినేటర్ పి సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీలో కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న డాక్టర్ ఏ కనకదుర్గ ఆధ్వర్యంలో కోళ్ల జ్యోతి పరి శోధన చేశారు. 'కోర్ బ్యాంకింగ్ సేవల నాణ్యతపై కస్టమర్ల అవగాహన' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన ప్రభుత్వ ,ప్రైవేటు రంగ బ్యాంకుల పై ఆమె అధ్యయనం చేశారు.

## యువత అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలి

● పీవీ సునీల్‌కుమార్

కొల్లిపర, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అంబేద్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకుడు ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ అన్నారు. శనివారం గుంటూరు జిల్లా కొల్లిపర మండలం తూములూరు శివారు క్రిస్టియన్‌పాలెంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరిం చారు. అనంతరం జరిగిన సభలో సునీల్‌కుమార్ మాట్లాడుతూ యువత అంబేద్కర్ చూపిన అడుగు జాడల్లో నడిచి చైతన్యవంతులు కావాలని దానికి ముఖ్య ఆయుధం విద్యనే అని పేర్కొన్నారు. మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘ నాయకులు కనపర్తి అబ్రహాం లింకన్, బేతాళ భూషణం తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్